

- కట్టడి పేరుతో ఖాప్ పెద్దల అమానుషం
- పేగు బంధాలపైనే కన్నవారి గొడ్డలి వేట్లు
- 8 రాష్ట్రాల్లో పరువు హత్యల పరంపర
- చర్యలు కోరుతూ కేంద్రానికి సుప్రీం ఆదేశం
- పార్లమెంటు సమావేశాలో పరువు హత్యలబిల్లు

# ఉరి కొయ్యపై ఉత్తరాది యువతి.. !



ముహమ్మద్ షఫీ అహ్మద్
news.shafi@gmail.com

ఉత్తరాదిన ఆటవిక యుగం నాటి చట్టాలు ఇంకా కొనసాగుతున్నాయి. 'పరువు' పేరుతో యువతుల్ని మట్టుబెట్టే ప్రక్రియ యథేచ్ఛగా కొనసాగుతోంది. గ్రామాల పాలనను తమ గుప్పెట్లో పెట్టుకున్న 'ఖాప్' పెత్తందార్లు ఆటవిక న్యాయాన్ని అమలుపరుస్తున్నారు. ఇష్టపడి పెళ్లి చేసుకున్న యువతీ యువకులను కర్కశంగా వధిస్తున్నారు. పంచాయితీ పెద్దల ఆదేశాలు అక్కడ శిలాశాసనంగా అమలవుతున్నాయి. ప్రేమ పేరుతో ఒకటైన జంటలను కట్టుబాట్ల నెపంతో ఖాప్ పెద్దలు వేధిస్తున్నారు. అటువంటి వారు ఊరు విడిచి వెళ్లేదాకా తరిమి తరిమి కొడు తున్నారు. పెళ్లి బంధాన్ని వదులుకోవాలని హింసి స్తున్నారు. మాట వినక మొండికేసిన జంటలను బలవన్మరణాలను ఆశ్రయించేలా హింసిస్తు న్నారు. ఎదురు తిరిగిన యువతులను ఉరి కొయ్యలపై వేలాడదీస్తున్నారు. పెద్దల మాటను ధిక్కరించినందుకు యువకులు శవాలుగా మారు తున్నారు. అదృశ్యమైన అనేకమంది యువకుల మృతదేహాలు ఊరి చెరువుల్లోనో, కాలువల్లోనో, నదుల్లో చీకి పాచిపోయి కుళ్లిన స్థితిలో తేలు తున్నాయి. మరికొన్ని చోట్ల యువకుల 'అదృశ్యం' మిస్టరీ వీడటం లేదు. పంచాయితీ పెద్దలు కన్నెర్ర చేసిన కుటుంబాలు బిక్కు బిక్కుమంటూ బతుకీడుస్తు న్నాయి. ఎదురు తిరిగితే మనుగడ లేక పెద్దల ముందు సాగిలపడుతున్నాయి. పెత్తందార్ల జులుంకు జీ హుజూర్ అంటు న్నాయి. ఒకటి అర సందర్భాల్లో పోలీస్ స్టేషన్‌లో న్యాయం కోరే కుటుంబాలకు వేధిం పులు తప్పడం లేదు. సామాజిక బహిష్కరణ ద్వారా పంచాయితీ పెద్దలు ఆ కుటుంబాలపై అక్కసు తీర్చుకుంటున్నారు. మంచానికి, కంచానికి నోచకుండా ఆదేశాలు జారీ చేస్తు న్నారు. పెళ్లిళ్లకు, పేరంటాలకు ఆహ్వానాలు పంప రాదని కట్టడి చేస్తున్నారు. పెద్దల ఆదేశా లను కాదని గుట్టుగా సంబంధ బాంధవ్యా లను నెరిపే వారిపై రేయింబవళ్లు నిఘా కొనసాగిస్తున్నారు. సమాజ బహిష్కృతులను, అక్కున చేర్చుకుంటే అదే స్థాయి దండన విధిస్తున్నారు.

## బాధితుల ఆవేదన అరణ్యరోదన

ఖాప్ పెద్దల నుంచి పీడనను ఎదుర్కొంటున్న అనేక కుటుంబాలు సమాజం నుంచి వేరు పడలేక, ఒంటరిగా బతకలేక చిత్ర వధను అనుభవిస్తున్నాయి. తప్పిదానికి ఒగ్గేయమని పెద్దలను అర్థిస్తున్నాయి. దారికొచ్చిన కుటుం

బాలను గ్రామాల పెద్దలు భారీగా జరిమానాలు వడ్డిస్తున్నారు. రోజుల్లో గడువు విధించి, జరిమానాలు చెల్లించిన వారికి విముక్తి ప్రసాదిస్తున్నారు. సమయానుసారం పైకం అందక చెల్లింపుల్లో కాస్త జాప్యం జరిగినా రెట్టింపు జరిమానా విధిస్తున్నారు. స్థోమత లేక పైకం చెల్లించలేని వారి దుస్థితిని ధిక్కారంగా భావించిన గ్రామ పెద్దలు, కట్టడి పేరుతో మరింతగా ఉక్కు పాదం మోపుతున్నారు. కట్టుబాట్లను ధిక్కరించలేక, జరిమానాలు కట్టలేక అనేక కుటుంబాలు కుమిలి కుమిలి బతుకీడుస్తున్నాయి. పెద్దల ఆదేశాలకు భయపడి కొన్ని కుటుంబాలు, తమ కన్నబిడ్డలను తమ స్వహస్తాలతో పంచాయితీ పెద్దలకు అప్పగిస్తున్నారు. కన్నవారి కళ్ల ముందే పంచాయితీ పెద్దల వారిపై పాశవిక శిక్షలను అమలుపరుస్తున్నారు. పెడబొబ్బలు పెట్టినా జంటల పట్ల కరుణ చూపడం లేదు. ఊరు విడిచి పారిపోవడమో, చావో రేవో తేల్చుకోవడమో నిర్ధారించుకునే వరకూ బల ప్రయోగం కొనసాగిస్తున్నారు. పెద్దల ఆదేశాలకు లోబడి ఊరు విడిచిన వారితో గ్రామం మొత్తం, స్వకుటుంబంతో సహా సంబంధాలు తెంచుకొనేలా కట్టడి చేస్తున్నారు.

## శిలాశాసనంగా పెద్దల హుకుం

ఖాప్ పెద్దల ప్రమేయంతో శిక్షార్హులైన బాధితులు, ఏళ్లుగడిచినా ఊరు వైపు కన్నెత్తి చూసే సాహసం చేయరాదనే హుకుంనామా ఆయా గ్రామాల్లో అమలవుతోంది. కన్నవారిని, పేగు బంధాలను, రక్త సంబంధాలను మరువలేక ఒకరూ, ఇద్దరూ.. గ్రామాల్లో ప్రవేశించే సాహసం చేస్తే వారికి చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. ఊరి పొలిమేర్లలోని నదుల వద్ద మాటువేసి నీళ్లలో ముంచి వారిని వధిస్తున్నారు. బాధిత కుటుంబాలు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించడం కూడా అక్కడ నేరం. ఫిర్యాదులను పోలీసు స్టేషన్‌కు చేరవేసే సాహసం ఏ ఒక్కరూ చేయరాదు. తప్పి జారి ఒకటి, అరా ఫిర్యాదు పోలీసు స్టేషన్‌కు చేరితే, స్వయంగా పోలీసు అధికార్ల నుంచి పెద్దలతో రాజీ చేసుకోమని సూచనలు వెలువడటం అక్కడ పరిపాటి.

## 8 రాష్ట్రాల్లో పరువు హత్యల దురాగతాలు

దేశం అన్ని రంగాల్లో పురోగమించిన ఈ దశలో ఇటువంటి అకృత్యాలన్నీ దేశంలోని మారుమూల ప్రాంతాలలోనో, సభ్యతా సంస్కృతులు అంతగా వికసించని వెనుకబడిన ప్రాంతాల్లోనో జరుగుతున్నాయనుకుంటే అది పొరపాటే అవుతుంది. దేశ రాజధానికి యోజనాల దూరంలో ఉన్న హర్యానా, రాజస్థాన్, యు.పి., పంజాబ్ వంటి ప్రగతిశీల రాష్ట్రాల్లో 'పరువు' హత్యల అకృత్యాలు యధేచ్ఛగా కొనసాగుతున్నాయి. జార్ఖండ్, తమిళనాడు సహా ఆంధ్ర రాష్ట్రంలోనూ అడపాదడపాగా ఇదే తంతు కొనసాగుతోంది. 'పరువు' హత్యల నేపథ్యంలో ఉత్తరాది రాష్ట్రాల్లో 'సగోత్రం' వ్యవహారాన్ని ఖాప్ పెద్దలు ప్రముఖంగా తెరపైకి తెస్తున్నప్పటికీ, వాస్తవంగా దాని పాత్ర చాలా చిన్నది. సమాజంలోని ఉన్నతవర్గాలు, ముఖ్యంగా భూస్వామ్య, కులాలు 'పరువు' హత్యలను తమ స్థాయీ వ్యవహారాలుగా భావిస్తున్నాయి. ఉత్తరాది అనేక ప్రాంతాల్లో 'సగోత్రం' మధ్య వివాహ బంధం నిషిద్ధం. హిందూ సమాజంలోని అనేక వర్గాల్లో ఇదే విధానం కొనసాగుతూ వస్తోంది. సగోత్రాల మధ్య వివాహ సంబంధాలు అరుదు. సంస్కృతి, సంప్రదాయాలను పాటించే ఆ సమాజం వివాహానికి ముందే అన్ని విషయాలను ఆచి, తూచి సరిపోల్చుకుంటుంది. ఒకటి అరా సందర్భాల్లోనే వివాహం జరిగే అవకాశాలు తక్కువ. ఒకవేళ అలా జరిగిన సందర్భంలో విషయాలు అంతగా ప్రచారానికి నోచుకోవు. గుట్టు చప్పుడు కాకుండానే సమసిపోతాయి.

## అధ్యయన నివేదికలు ఏం చెబుతున్నాయి..

పరువు హత్యల నేపథ్యంలో ఉన్నత, పేద బేధభావంతో పాటు కులమతాల అంతరాలు ఉన్నట్లు రిపోర్టులు నిగ్గు తేల్చాయి. జాతీయ మహిళా కమిషన్ తాజా రిపోర్టు ఇవే అంశాలను స్పష్టీకరించింది. పరువు హత్యలన్నిటిలో 'సగోత్రం' హత్యలు కేవలం మూడు శాతంగా తేల్చింది. ఒక శాతం మతాంతర నేపథ్యంగా పేర్కొంది. 24 శాతం ఇతరత్రా కారణాలు ఉంటే 72 శాతం పరువు హత్యలు కులాంతర వివాహాలేనని స్పష్టం చేసింది. సంపన్న వర్గాలు తమ యువతులను అన్ని విధాల కట్టడి చేస్తున్నాయని, భాగస్వామి ఎంపిక విషయంలో అమానుషంగా వ్యవహరిస్తున్నాయని కమిషన్ అభిప్రాయపడింది. స్వేచ్ఛగా వరుడి ఎంపికకు ఉత్తరాది యువతులకు అవకాశం లేదని, స్థాయి హోదాను బట్టి అక్కడ వివా హాలు కొనసాగుతాయని పేర్కొంది. యువతి ఐచ్ఛిక వివాహానికి పెద్దల ఆశీర్వచనాలు దక్కడం లేదని, పైపెచ్చు తమకు నచ్చిన వారితో



### పరువు హత్యల్లో సగోత్రం పాత్ర స్వల్పం

ఉత్తరాదిలో స్వగోత్రం పరిస్థితి అందుకు పూర్తి భిన్నం. అన్ని ప్రాంతాల మాదిరిగానే ఇక్కడా వివాహాలు సంప్రదాయ బద్ధం గానే నిశ్చయమవుతాయి. పెళ్లితంతూ ఘనంగా కొనసాగుతుంది. సగ్రోతాల మధ్య వివాహానికి ఆస్కారమే ఉండదు. పైపెచ్చు ఉత్తరాది సమాజం అందుకు హర్షించదు. ఈ విషయం అక్కడి యువ తకు బాగా తెలుసు. ఆకర్షణకులోనైన ఆరంభ దశలోనే అక్కడి యువత ఆ మేరకు జాగ్రత్తలు తీసుకుంటుంది. ఆ విషయంలో సందేహం అక్కర్లేదు.

అయినప్పటికీ 'పరువు' హత్యలన్నీ 'సగోత్ర' వ్యవహారంగా ఉత్తరాది సంపన్న వర్గాలు చూపుతున్నాయి. 'పరువు' హత్యల నేపథ్యంలోని చీకటి కోణాన్ని దాచి పెడు తున్నాయి. పేరుకే 'పరువు' హత్యలైనా, హత్యల మూలంలో సామాజిక నిమ్నోన్నత తలు దాగి ఉన్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. భూస్వామ్య వర్గాలకు, అక్కడి నిమ్న వర్గాలకు మధ్య తలెత్తిన భూ వివాదాలే తదనంతరం పరువు హత్యలవు తున్నా యనే వాదన ప్రచారంలో ఉంది. ఒకే ఊరి నుంచి చదువుల కోసం కళాశా లలో చేరిన నిమ్న, ఉన్నత కులాల యువతీ, యువకుల మధ్య పెరిగిన పరిచయం కూడా ఖాప్ పెద్దల ఆగ్రహానికి కారణ మవుతోంది.

బతుకును కొనసాగించే స్వేచ్ఛా దక్కడం లేదని అభిప్రాయపడింది. కళాశాల పరిచయంలో పెళ్లాడిన యువతి, కుటుంబ పరువు, మాన మర్యాదలను మంటగల్పిందని, సంపన్న వర్గాలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నాయని పేర్కొంది. సంతానం అనే కనికరం లేకుండా మట్టుబెడుతున్నారని కమిషన్ ఆందోళన చెందింది. గ్రామాల్లో ఈ కట్టడి ఘోరాతి ఘోరంగా ఉందని ఆడ పిల్లలను అమానుషంగా వేధిస్తున్నారని అభిప్రాయ పడింది. కట్టడి దాటిన యువతులను బహిరంగ ప్రదేశాల్లో నగ్నంగా ఊరేగించడం, నలుగురిలో నగుబాటు చేయడం, గ్రామ చావడీల ముందుకట్టేసి కొట్టడం అనేక గ్రామాల్లో కొనసాగుతుందని కమిషన్ పేర్కొంది. ప్రభుత్వ యంత్రాంగాలు, వ్యవస్థలు ఈ ఉదంతాలపై ఉదాసీనత వ్యక్తం చేస్తున్నాయని, వీటిని నియంత్రించాలని పోలీసు యంత్రాంగం అచేతనంగా ఉండిపోతుందని ఆవేదన వ్యక్తం చేసింది. పరువు హత్యల విషయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన కార్యాచరణ రూపొందించి, కఠిన చట్టాలు అమలుపరిస్తే కాని నియంత్రణ సాధ్యం కాదని తెలిపింది.

### అమానుషాలపై కోర్టుల కన్నెర్ర

మరోవైపు ఈ దారుణాలను అడ్డుకోవాలని 'శక్తి వాహిని' అనే స్వచ్ఛంద సంస్థ 'సుప్రీం కోర్టులో ప్రజాప్రయోజనాల వ్యాజ్యాన్ని దాఖలు చేసింది. ఇది విచారణ దశలో ఉండగానే 'పరువు' హత్యల్లో భాగస్వాములైన 5గురిని హైకోర్టు మరణశిక్ష విధించింది. ఈ శిక్షా ఉదంతం ఉత్తర భారతంలో కలకలం రేపింది. ఉత్తరాది సంపన్న వర్గాలు హర్యానా హైకోర్టు తీరుపట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. కోర్టు తీర్పును సమీక్షించాల్సిందిగా సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. మరోవైపు పరువు హత్యల వ్యవహారంలోనూ ఢిల్లీ హైకోర్టు పోలీసుల వైఖరిపై మండిపడింది. డబ్బుకోసం నిందితులతో కుమ్మక్కవుతున్నారని తీవ్రస్థాయిలో విమర్శించింది. ప్రజా భద్రతలను విస్మరిస్తున్నారని దుయ్యబట్టింది. ఈ విషయమై హైకోర్టు న్యాయమూర్తి 'ధింగ్రా' నేరుగా పోలీసులపై తీవ్రస్థాయి వ్యాఖ్యలు చేశారు. యువజంట పారి పోయిన కేసులను, పోలీసు అత్యాచారం కేసులుగా మారుస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "పారిపోయిన కేసులను అత్యాచారం కేసులుగా మార్చడం దురదృష్టకరం. పరువు హత్యల కేసుల్లో మీరూ భాగస్వాములేనని, డబ్బుకోసం తల్లిదండ్రు లతో కుమ్మక్కవుతున్నారు. సాధారణ పౌరులను నేరస్తులుగా మారుస్తున్నారు. ఒక యువతి ప్రేమ వ్యవహారం కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు.

### ఆర్తి పట్ల కుల పెద్దల అమానుషం

జార్ఖండ్ రాష్ట్రం రాజదోహ గ్రామానికి చెందిన 'ఆర్తి'ది మరోవిషాదం. అదే గ్రామానికి చెందిన పురుషోత్తంను 13 ఏళ్ల క్రితం వివాహమాడింది. ఇద్దరూ భూమిజ గిరిజన తెగకు చెందినవారు. అందునా ఇరువురిదీ 'గరుడ' సగోత్రం. వివాహ సమయంలో కులపెద్దలు అంగీకరించలేదు. కట్టుబాట్లను కాదని పెళ్లి చేసుకొని, రాంచీ సమీపంలో కాపురం పెట్టారు. పదేళ్ల కాలంలో నలుగురు పిల్లలు. సమస్యంతా సమసిపోయిందని ఓ రోజు పురుషోత్తం స్వగ్రామం 'రాజదోహ'కు తన 4 ఏళ్ల కొడుకుతో బయలుదేరాడు. మార్గమధ్యంలో 'సువర్ణరేఖ' నది దాటుతుండటాన్ని గమనించిన గ్రామస్థులు కులపెద్దల ఆధ్వర్యంలో దాడి చేసి అతన్ని నదిలో ముంచి చంపేశారు. ఆగష్టు 15, 2008న ఈ సంఘటన జరిగింది. ఆ తరువాత అక్కడికి చేరుకున్న 'ఆర్తి'ని హింసించారు. కనీసంగా భర్త దహన సంస్కారల విషయంలోనూ ఎవరూ సహకరించలేదు. ఇరువురి రక్త సంబంధీకులు, బంధువులూ ఊరికట్టుబాట్లకు భయపడి బయటకు రాలేదు. ఆర్తితో ఇదివరకే తెగతెంపులు చేసుకున్నామని, తండ్రి సహా, సోదరులూ సహకారానికి నిరాకరించారు. గంపెడు విషాదం భరిస్తూనే ఆర్తి తన భర్త దహన సంస్కారాలను తానే స్వయంగా నిర్వహించింది. అందుకూ అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అనేకానేక విమర్శలు, ప్రజా సంఘాల ఒత్తిడిల మధ్య అక్కడి పోలీసులు సంఘటనపై కేసు నమోదు చేశారు. గ్రామపెద్ద సహా 24 మంది జైలుకు తరలించారు. అక్కడి "ఘాట్శిలా" కోర్టులో ఇంకా విచారణ కొనసాగుతుంది. ఈ కేసు నేపథ్యంలో "భూమిజ తెగ" ఆసాంతం బాధితురాలికి వ్యతిరేకమైంది.

### ప్రభుత్వాల పరువు తీస్తున్న హత్యల వ్యవహారం

ఉత్తరాది పరువు హత్యల 'వ్యవహారం' ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర ప్రభుత్వా నికీ తలనొప్పిగా మారింది. కట్టుబాట్ల నేపథ్యంలో గుట్టు చప్పుడు కాకుండా సమసి పోయేవి ఎన్నో అయితే రచ్చకెక్కేవి కొన్ని మాత్రమే. ప్రచార, ప్రసార మాధ్యమాలు, ప్రజా



### సెగపుట్టిస్తున్న సుష్మాతివారి ఉదంతం

ఉత్తరప్రదేశ్కు చెందిన సుష్మాతివారి ఉదంతం కూడా ఇటువంటిదే. ఆరేళ్ల క్రితం తన క్లాస్మెట్ ప్రభు నోచల్ను పెళ్లాడింది. అతను నిమ్న కులస్థుడు. ఇందుకు ఆగ్రహిం చిన సుష్మ కుటుంబీకులు, ఆమె భర్తపై అతని పరివారంపై జరిపిన దాడిలో 5గురు చనిపోయారు. వేరే పనిపై బయటకు వెళ్లిన సుష్మ ప్రాణాలతో బయటపడింది. బాంబే హైకోర్టు నేరస్తుడికి మరణశిక్ష విధించింది. దీనిపై నిందితుడు సుప్రీంకోర్టుకు వెళ్లాడు. వాదనలు విన్న సుప్రీంకోర్టు మరణశిక్షను 25 ఏళ్ల కఠిన కారాగార శిక్షగా మార్చింది. సుప్రీం తీర్పు తనను అమితంగా బాధించిందని బాధితురాలంటుంది. తన భర్త పరివారం పై అమానుష దాడిని ఉరి తీయాల్సినంత పెద్ద తప్పుగా సుప్రీంకోర్టు భావించకపోవడాన్ని అభ్యంతరం వ్యక్తం చేస్తుంది. అత్యున్నత న్యాయస్థానం హత్యోందతాలను సామాజిక పరిస్థితుల నేపథ్యంలో విశ్లేషించడాన్ని నొచ్చు కుంటుంది. దారుణకాండను సామాజిక కోణంలో చూడటం కుల వ్యవస్థకు మద్దతు పలకడమేనంటుంది. దోషి తన రక్తం పంచుకుపుట్టినా అతనికి మరణశిక్షే సరైనదని, సుదీర్ఘ న్యాయపోరాటం చేస్తోంది. అందుకు సుష్మ దేశవ్యాప్తంగా మద్దతు కూడకడుతోంది.



## ఖాప్ పంచాయితీల వ్యూహం ఏమిటి

ఖాప్ పెద్దలు తమ తమ ప్రాంతాల్లో తమకున్న శక్తియుక్తులను, సామాజిక పట్టును ఏకం చేస్తూ తమ ప్రాంతాల ప్రజాప్రతినిధులపై తమకు అనుకూలంగా వ్యవహరించమని ఒత్తిడి తెస్తున్నారు. అందుకు హిందూ వివాహ చట్టాన్ని సవరించాలని పట్టుబడుతున్నారు. తమ 'పెద్దరికాన్ని' సమర్థించే విధంగా హిందూ వివాహ చట్టంలో మార్పులు కోరుతున్నారు. అందుకు వివాహ సంప్రదాయాల్లో 'గోత్రాన్ని' సూత్రీకరించాలని, గోత్ర సంబంధ వివాహాలపై నిషేధాన్ని విధించాలని పట్టుబడుతున్నారు. ఆ ప్రతిపాదనకు కేంద్రం అంత సానుకూలంగా లేనప్పటికీ, తమ తమ ప్రాంత ప్రజాప్రతి నిధులపై ఆ మేరకు ఒత్తిడి తెస్తున్నారు.

సంఘాలు అరచి గోలచేస్తేనే కాని ఈ ఉదంతాలు వెలుగు నోచడం లేదు. పరువు పేరుతో పేగు బంధాలను తెగ నరకడాన్ని కోర్టులు తీవ్రంగా ప్రశ్నిస్తున్నాయి. ఈ అమాను షాలన్నిటిపై ఇటీవల దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. పరువు హత్య నేపథ్యంలో కొనసాగుతున్న అమానుషాన్ని కట్టడి చేయకపోవడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ అనాగరికాన్ని, అడ్డుకునే విషయమై ప్రభుత్వాల ఉదాసీనతను ప్రశ్నించింది. వీటి నియంత్రణకు చేపడుతున్న చర్యల విష యమై సంజాయిషీ కోరుతూ నోటీసులు జారీ చేసింది. సుప్రీం జోక్యంతో ప్రభుత్వాల్లో కొంత కదలిక వచ్చింది.

### పరువు వ్యవహారంపై కేంద్రంలో కదలిక

పరువు వ్యవహారాల విషయమై అన్నింటా వెల్లువెత్తుతున్న నిరసన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చర్యలకు సన్నాహాలు ప్రారంభిం చింది. కఠిన చట్టాలను రూపొందించే క్రమంలో కసరత్తులు చేస్తుంది. వీటిని నిరోధించే విషయమై రాష్ట్రాలతో చర్చించి, చట్టాల రూపకల్పనకు గాను తగు సిఫార్సులు చేసేందుకు మంత్రుల బృందాన్ని నియ మించింది. వివిధ రాష్ట్రాల ముఖ్య మంత్రులు, హోం మంత్రులతో మంత్రుల బృందం సమావేశమై 'పరువు హత్యల' నేపథ్యాన్ని, సామాజిక పరిస్థితిని, నియంత్రణ చర్యలను కూలంకుషంగా చర్చిస్తుంది. రాష్ట్రాల నుంచి ఈ విషయమై సేకరించి సమా చారాన్ని క్రోడీ కరించి ఒక ముసాయిదా రూపొందిస్తుంది. ఆ మేరకు ఓ బిల్లును రూపొందించి చట్ట సవరణలతో పాటు పలు కొత్త ప్రతిపాదనలతో ఓ బిల్లును తెచ్చే ప్రయత్నంలో ముందుకు సాగుతోంది. ఈనెల 26నుంచి ప్రారంభ మయ్యే వర్షాకాలపు పార్లమెంటు సమావేశాల్లో సవరణ బిల్లు చోటు చేసుకోవచ్చు.

### పరువు బిల్లులో ప్రాధాన్యతలు ఏమిటి

భారత శిక్షాస్మృతికి సంబంధించి సవరణ బిల్లులో ప్రధానంగా మూడు ప్రతిపాదనలపై కేంద్రం దృష్టి సారిస్తోంది. పరువు ప్రతిష్టల పేరుతో సాగుతున్న ఈ మారణకాండను 'హత్యానేరం'గా పరిగణించే విధంగా భారత శిక్షాస్మృతిని సవరించడం. ఇప్పటివరకూ హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న వారిపైనే నేరం నమోదవుతూ వస్తోంది. గ్రామ పెద్దలపై కుట్రదారుల అభియోగం మాత్రమే నమోదవు తుంది. సవరణ బిల్లు దరిమిలా ప్రత్యక్షంగా హత్యలో పాల్గొన్న వారితో పాటు, గ్రామ పెద్దలపై కూడా హత్యానేరం నమోదవుతుంది. ఈ చట్టాలను ఇంకా కఠినతరం చేస్తే దోషు లందరికీ ఒకే శిక్ష విధింపునకు వీలు కలుగు తుంది.

రెండో అంశం, పరువు హత్యల్లో నేరారోపణలు ఎదుర్కొంటున్న వారే తమ నిర్దోషిత్వాన్ని ఋజువు చేసుకునే విధంగా చట్ట సవరణ చేయాలన్నది మరో ప్రతిపాదన. అందుకు గాను, భారతీయ సాక్ష్యాధారాల చట్టాన్ని సవరించాలన్నది కేంద్రం యోచన. ఈ ప్రకారం పరువు హత్యల్లో భాగస్వాములైన కులపెద్దలే ఇకపై తను నిర్దోషిత్వాన్ని ఋజువుపర్చే ఆధారాలను సంబంధిత కోర్టుల ఎదుట సమర్పించుకోవాల్సి ఉంటుంది.

మరో అంశం 1954 నాటి ప్రత్యేక వివాహ చట్టాన్ని సవరించాలనేదే కీలక ప్రతిపాదన. గతంలో ఈ చట్టం ప్రకారం వివాహమాడదల చిన యువతీ యువకులు 30 రోజులు ముందుగా అభ్యంతరాలు తెలుపమని నోటీసులు ఇవ్వాల్సి ఉండేది. వివాహానికి ముందు కాలపరిమితి ఉండటంతో కుల పెద్దలకు కట్టడికి ఆస్కారమేర్పడుతోంది. ఈ జాప్యంలో అవాంఛనీయ చర్యలకు ఆస్కార మేర్పడుతుంది. ఈ చట్ట సవరణ దరిమిలా వెనువెంటనే వివాహ అవకాశం ఉండటంతో వెంటనే యువతీ యువకులు చట్టపరమైన రక్షణ లభించే అవకాశం ఉంది. ప్రత్యేక వివా హాల చట్ట (1954) సవరణ విషయమై మరింత స్పష్టతను అభ్యుదయవాదులు కోరుతున్నారు. మొత్తం మీద 'కఠిన చట్టాలు' తెచ్చి పరువు హత్యలను కట్టడి చేస్తే కాని ఉత్తరాదిన ఈ అమానుషం ఆగేలా లేదు. కేంద్ర ప్రభుత్వం ఈ విషయమై పట్టుదలతో వ్యవహరిస్తున్నా 'స్థానిక పెద్దలు' తమదైన శైలిలో కేంద్రం నిర్ణయాన్ని ప్రభావితం చేసే విధంగా పావులు కదుపుతున్నారు.

### ప్రజాప్రతినిధులకు గుదిబండగా పరువు హత్యలు

తమ డిమాండు అన్నింటా బలపడే విధంగా ఖాప్ పెద్దలు ఇటీవల భారీ ర్యాలీ నిర్వహిం చారు. ఈ ర్యాలీ దేశం మొత్తం మీద పెద్ద చర్చనీయాంశమైంది. అన్నింటా రాజకీయ అంశాలు ప్రధాన పాత్ర పోషించే ఈ తరు ణంలో కుల పెద్దలను కాదని ప్రజాప్రతి నిధులు మనుగడ సాగించే పరిస్థితి లేదు. ఎన్నికల్లో జయాపజయాలను పెద్దల నిర్ణయం ప్రభావితం చేస్తుందనడంలో ఎటువంటి సందేహం లేనప్పటికీ, 'పరువు హత్యలు' ప్రజాప్రతినిధులకు గుదిబండగా మారాయి. కుల పెద్దల ఆగ్రహాన్ని చవిచూస్తే 'ఎన్నికల్లో' ఓటమి పాలు కాక తప్పదని, అదీ తమ 'పరువు'కు సంబంధించిన విషయమని ప్రభా విత ప్రాంతాల ప్రజాప్రతినిధులు వాపోతు న్నారు. అందుకు కుల పెద్దలకు సహకరిం చడం మినహా మరో గత్యంతరం లేకపోవ డంతో 'ఖాప్' పెద్దలకు మద్దతు పలుకు తున్నారు. తమకు రాజకీయ అండ దొరక డంతో కుల పెద్దలూ, తమ రక్షణకు తమదైన శైలిలో చక్రం తిప్పుతున్నారు. పరువు హత్యల బిల్లు చట్టంగా ముందుకు వస్తే తప్ప ఈ విష యమై మరిన్ని పరిణామాలను విశ్లేషించడం సాధ్యమవుతుంది.అప్పటి వరకు పరిణామాల న్నిటినీ నిశితంగా గమనించక తప్పదు. ○

# బ్రిటన్‌లో

# ముస్లిముల పోరాటం

- అశోక్




**బ్రిటన్‌లో ముస్లిమ్‌లు తీవ్ర అణచివేతకు గురవుతున్నారు. ఉగ్రవాదం, మహిళల అణిచివేత, అసమానత్వం, అన్యాయం వంటి సమస్యల వలయంలో చిక్కుకొని విలవిలలాడుతున్నారు. ముస్లింల ఈ దుస్థితిపై ఇటీవల జరిగిన ఓ పోల్ ఫలితాలు చూసి ఏమి పట్టించుకోకుండా ఉండేవారు సయితం ఖంగుతిన్నారు. అయితే బ్రిటన్‌లో 10 లక్షల 60 వేల మంది ముస్లింలు బ్రిటీష్ సమాజంపై సకారాత్మక ప్రభావం చూపుతున్నారని కొందరు భావించినట్లు కూడా వెల్లడయింది.**

ఆ పోల్‌లో ప్రశ్నించినవారిలో 58 శాతం మంది ఇస్లాం ధర్మానికి, ఉగ్రవాదానికి సంబంధముందని, 68 శాతం మంది ఇస్లాం ధర్మం మహిళలకు వ్యతిరేకమైనదని అన్నారు. కేవలం 13 శాతం మందే శాంతియుతంగా, ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మతం ఇస్లాం అని అన్నారు. బ్రిటీష్ సమాజానికి అక్కడి ముస్లింలు ఏమైనా మంచి చేశారా? అన్న ప్రశ్నకు పదిమందిలో నలుగురు లేదనే జవాబిచ్చారు.

మామూలుగా చూసేవారికి ఇది కేవలం ట్రెండ్‌ను పరిశీలించే ఓ పోల్ మాదిరిగానే కనిపిస్తుంది. గత దశాబ్ద కాలంగా ప్రపంచంలో ఇస్లాం ధర్మం పట్ల, ముస్లింల పట్ల నిరాటంకమైన ప్రతికూలత కనబడుతోంది. నేడు సంకుచిత భావాలు ప్రబలి ఉన్న తరుణంలో ప్రతీ చెడుకు ముస్లింలను బాధ్యుల్ని చేయడం కలవరపరిచేదిగా ఉంది. చాలా ఏళ్ళ తరువాత ఇప్పుడు బ్రిటీష్ ముస్లింలు కాస్తా స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటున్నారు. ఫ్రాన్స్, బెల్జియంలతో సహా ఇతర యూరోప్ దేశాలకంటే కూడా ఇంగ్లాండులో తమ పరిస్థితి కాస్త మెరుగ్గా ఉందనీ బ్రిటీష్ ముస్లిములు భావిస్తున్నారు.

"బ్రిటన్‌లో జీవిస్తున్నందుకు మేము అదృష్టవంతులం. ఇతర దేశాలతో పోల్చినప్పుడు ఇది మాకు స్వర్గమనిపిస్తోంది' అని ఓ ముస్లిమ్ కార్యకర్త అన్నారు. అయితే ఆ పోల్‌ని స్పాన్సర్ చేసినవారు మాత్రం వెలువడ్డ అభిప్రాయాలు చూసి ఆశ్చర్యానికి గురయ్యారు.

"అవును. మేము ఆశ్చర్యపోయాం. మమ్మల్ని కలవరపరిచే విషయమిది' అని ఆ పోల్‌ని నిర్వహించిన ఎక్స్‌ప్లోరింగ్ ఇస్లాం ఫౌండేషన్ ప్రతినిధి అభిప్రాయపడ్డారు.

తమ సముదాయం మేలును కాంక్షిస్తున్న విద్యావంతులైన యువ బ్రిటీష్ ముస్లిం ప్రొఫెషనల్స్ ఈ ఎక్స్‌ప్లోరింగ్ ఇస్లాం ఫౌండేషన్‌ను స్థాపించారు. వారిలో చాలామంది ఆసియా ఖండానికి చెందినవారే. ఆ ఫౌండేషన్ ముఖ్యలక్ష్యం- ఇస్లాం పట్ల, ముస్లిముల పట్ల ఏర్పడుతున్న అపోహలను ఛేదించడమే; ఇస్లాం ధర్మంపట్ల చైతన్యం, సాంస్కృతిక ఆచారాల పట్ల చేతన తీసుకురావడం; నాగరికతకు ముస్లిములు అందించిన సేవలను ఎలుగెత్తి చాటడం, ఇస్లాం పట్ల, మీడియా ద్వారా ప్రచారమవుతున్న అపోహల్ని దూరం చేయడం.

'ఆధునిక జీవితానికి సంబంధించిన పలు అంశాలతో ఇస్లాంకున్న సంబంధాలను విశ్లేషించి చూడడాన్ని మేము హర్షిస్తున్నాము.21వ శతాబ్దంలో బ్రిటన్‌లో ఇస్లాం స్థానం గురించి జరిగే చర్చల్లో మేము క్రియాశీలకంగా పాల్గొంటామ'ని ఆ ఫౌండేషన్ ప్రకటించింది.

ఆ పోల్‌కు ప్రతిస్పందనగా ఎక్స్‌ప్లోరింగ్ ఇస్లాం ఫౌండేషన్ ఓ ప్రాజెక్టును మొదలెట్టింది. దానిని 'ముహమ్మద్(స) ప్రేరణతో' అన్న పేరిట ఆరంభించింది. ప్రవక్త ముహమ్మద్(స) ప్రవచనాలతో ఓ పోస్టర్ ప్రచారం మొదలెట్టింది. మహిళల సాధికారత, సామాజిక న్యాయం, పర్యావరణం, సహనభావం, మానవ హక్కులు... ఇలా వివిధ అంశాలపై పుస్తకాలు ప్రచురించింది. ఆకర్షించే ప్రతి పోస్టర్‌కు 'ముహమ్మద్(స) ప్రేరణతో' అని ట్యాగ్‌లైన్ పెట్టింది. ఆ పోస్టర్లను లండన్ అండర్‌గ్రౌండ్, బస్సులు, టాక్సీలపై ప్రదర్శించారు. స్త్రీ పురుష సమానత్వం, సామాజిక న్యాయం, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలను యువ ముస్లిములు ప్రచారం చేశారు. తమ జీవన విధానం, నమ్మకాలు ప్రవక్త(స) వల్ల ప్రేరణ పొందాయని వారు ప్రకటించారు.

ఆ పోస్టర్లలో దర్శనమిచ్చిన వారు వృత్తిరీత్యా మోడల్స్ కాదు. సాధారణ మనుషులు. పాశ్చాత్య దేశంలో బ్రిటిష్ ముస్లిం యువత ఏవిధంగా ఇస్లాం సంప్రదాయాలని, ఆధునిక జీవన విధానంతో బ్యాలెన్స్ చేస్తోందో చూయించారు.

ఒక పోస్టర్‌లో సుల్తానా తఫదర్ అనే బారిస్టరు హిజాబ్‌తో దర్శనమిస్తారు. ఆ పోస్టర్ శీర్షిక 'నేను మహిళా హక్కుల్ని నమ్ముతున్నాను. అలాగే ముహమ్మద్(స)ను నమ్ముతున్నాను' అని ఉంది. మరో పోస్టర్‌లో ఇస్లాం ధర్మంలోకి మారిన ఎం.టీవి మాజీ ప్రెజెంటర్ క్రిష్టిన్ బేకర్ దర్శనమిస్తారు. అతడి పోస్టర్ ఇలా ప్రకటిస్తోంది : 'పర్యావరణాన్ని రక్షించాలని నమ్ముతున్నాను. అలాగే ముహమ్మద్(స)ని నమ్ముతున్నాను'. మరో పోస్టర్‌లో ముస్లిం ఛారిటీ వర్కర్ అయిన రూపన్ మియా దర్శనమిస్తారు. అతడి పోస్టర్ 'నేను సామాజిక న్యాయాన్ని నమ్ముతున్నాను. అలాగే ముహమ్మద్(స)ని నమ్ముతున్నాను' అని ఉంటుంది.

ఆ పోస్టర్లలో దర్శనమిచ్చిన స్త్రీ, పురుషుల వాదనలు, ప్రవక్త ముహమ్మద్(స) అసలు కొటేషన్స్‌ని వెబ్‌సైట్ 'www. inspiredby muhammad.com' మరింతగా వివరిస్తుంది. సామాజిక న్యాయం విషయంలో ప్రవక్త ముహమ్మద్(స) చెప్పిన అంశం "ఇతరులకు ఎంతగానో ఉపయోగపడేవారే ఉత్తములు".

ఇంకా ఆయన(స) మహిళల గురించి ఇలా అన్నారు : "మహిళలు పురుషులకు అర్ధ భాగం'. వారి హక్కులు పురుషుల హక్కుల్లా పవిత్రమైనవి. ఇక పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యత గురించి తెలుపుతూ ప్రవక్త(స)గారు ఏమన్నారంటే "ఈ భూమంతా నాకు మస్జిదు వంటిది' అన్నారు. దాన్ని పరిరక్షించమని ఆయన(స) తన అనుయాయులను కోరారు. నది పక్కగా నీరు పుష్కలంగా ప్రవహిస్తున్నా వృధా చేయరాదన్నారు. ప్రజా ప్రదేశాలను శుభ్రంగా ఉంచాల్సిన ప్రాధాన్యత గురించి కూడా ఆయన తెలిపారు. 'వీధిలోని చెత్తను తొలగించడం కూడా విశ్వాసంలో ఒక భాగం."

ఆ పోస్టర్లను ప్రదర్శించి 21వ శతాబ్దపు ముస్లిం ఎలా ఉన్నాడనేది ఆ ప్రచారకులు స్పష్టం చేశారు.

హిజాబ్ ధరించి పని చేసే తఫదర్ ఇలా అన్నారు : "ప్రముఖ హక్కుల సంస్థలో బారిస్టరుగా పనిచేసే తనను తరచూ కొందరు మహిళల విషయంలో ఇస్లాం వైఖరిని, మీ వృత్తిని ఎలా సంభాళిస్తున్నారు? అని అడుగుతుంటారు. ఇస్లాం ధర్మం పురుషులు, మహిళలు సమానం కాదంటున్న అపోహతో వారలా ప్రశ్నిస్తుంటారు. అది నిజం కాదు. నా వృత్తికి ప్రేరణ నా ఇస్లాం ధర్మం నుంచే నేను పొందుతున్నాను."

రొమానా అలీ పుట్టి పెరిగింది బ్రిటన్‌లోనే (ఆమె తల్లిదండ్రులు ఇండియా నుంచే వచ్చారు). ఆమె ఎక్స్‌ప్లోరింగ్ ఇస్లాం ఫౌండేషన్‌కు కెంపైన్స్ డైరెక్టరుగా పనిచేస్తున్నారు. తనలాంటి స్వతంత్ర ముస్లిం యువత తమ సముదాయం గురించి కలత చెందుతోందని ఆమె అన్నారు. ముస్లిం వేర్పాటువాదాన్ని చూపుతున్నది మీడియానే అని ఆమె అంటారు. "నేను బ్రిటీష్ జాతీయురాలైనందుకు గర్విస్తున్నాను. నా భారతీయ మూలాల విషయంలో కూడా నేను గర్విస్తున్నాను - ఇలాగే నా తరం ముస్లిములు చాలా మంది భావిస్తున్నారు."

తమ ఉనికి సమస్య (ఐడెంటిటీ క్రైసిస్ బిజినెస్) గురించి ముస్లిం యువత డోలాయమానంలో కొట్టుమిట్టాడుతోంది. అంతా ఓ రాజకీయ ఎజెండా అనీ, దానికి మీడియానే కారణమని చాలా మంది భావిస్తున్నారు. ఏదో ఒక గ్రూపును మొత్తం ముస్లిం సముదాయపు ప్రతినిధి గ్రూపుగా చూపడాన్ని ముస్లిం యువత అభ్యంతరపెడుతోంది. ఒకప్పుడు బ్రిటీష్ ప్రభుత్వం ప్రోత్సహించిన ముస్లిం కౌన్సిల్ ఆఫ్ బ్రిటన్ నేడు ఎక్స్‌ప్లోరింగ్ ఇస్లాం ఫౌండేషన్ అంతా బ్రిటీష్ ముస్లింలకు ప్రాతినిధ్యం వహించడం లేదు.

బ్రిటన్‌లోనే కాదు ప్రతిచోట మీడియా ఇస్లామోఫోబియా (ఇస్లాం అంటే భయం) సృష్టిస్తోంది. ఇది చెరుపు చేసే ఎజెండాలో ఓ భాగంగా ఉంది. కానీ ముస్లింల గురించి వారికివారే ఏమనుకుంటున్నారు? ప్రపంచమంతా వారికి వ్యతిరేకంగా ఎందుకుందని వారెప్పుడైనా ప్రశ్నించుకున్నారా? అమెరికన్లు సైతం తమకంతా వ్యతిరేకంగా ఉన్నారని అంటుంటారు. కానీ అలా ఎందుకున్నారని ఎప్పుడోగాని ప్రశ్నించుకోరు. ఆత్మ పరిశీలన అన్నది వారిలో లేదు. పైగా తాము బాధితులమన్న భావన వారిలో గాఢంగా ఉండి, ఆ సమస్యను ఎక్కువ చేస్తోంది. ప్రపంచమంతా తమపై కుట్ర చేస్తోందన్న భావన వారిది.

ప్రతికూల ముద్ర ఏర్పడడంలో స్వయంగా ముస్లిం సముదాయం పాత్ర ఉంటోందన్న ప్రశ్నలను మిసెస్ అలీ ప్రక్కదారి పట్టించారు. ఏది ముఖ్యమో చెప్పకుండా ప్రతికూల అభిప్రాయాలను, ముద్రలను ఎదుర్కోవాలన్నారు. అందుకు ముస్లిములను, ఇస్లాంను అర్థం చేసుకోవాలన్నారు.

"బ్రిటీష్ ముస్లిముల గురించి బాగా అర్థం చేసుకోవాలని, బ్రిటీష్ సమాజానికి వారేం సేవలందించారో గుర్తించాలని' ఆమె అన్నారు.

జనాభిప్రాయం ఎలా ఉన్నా మిసెస్ తరఫ్‌దార్, మిసెస్ అలీ వంటి మహిళలు కొత్త తరం బ్రిటీష్ ముస్లిములు ఎలా ఉంటారన్నది చూపుతున్నారు. వారు తమ భావాలను బలంగా ఆచరిస్తున్నప్పటికీ పాశ్చాత్య వ్యతిరేకతను కనబరచడంలేదు. ముస్లిమేతరులంతా ఇస్లాం శత్రువులన్న భావం కూడా వారిలో లేదు. వారు బ్రిటన్ సంస్కృతిలో చాలా వరకు మమేకమయ్యారు.

ఒకవేళ ఇదే బ్రిటీష్ ముస్లింల కొత్త రూపమా? అవుననుకోండి. 'ఒకవేళ' అన్నది చాలా పెద్ద విషయం. అయితే దానిని ఆలింగనం చేసుకుందాం. ***(ది హిందూ, 5జులై 2010)***

# విశ్వాసుల తల్లి హజ్రత్ హఫ్సా (రజి)

**విశ్వాసుల తల్లి హజ్రత్ హఫ్సా(ర)గారికి ఓ ప్రత్యేకత ఉంది; అదేమిటంటే, చేత్తో రాయబడిన ఖుర్ఆన్ గ్రంథం ఒకటి ఆమె(ర)గారి వద్ద ఉంది. దానిని ఆమె(ర)గారు ప్రాణంకంటే కూడా ఎక్కువగా చూసుకునేవారు. భద్రంగా దాచుకునేవారు.**

ఒకనాడు హజ్రత్ ఉమర్ ఫారూఖ్(రజిఅన్) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి సన్నిధిలో హాజరై ఇలా విన్నవించుకున్నారు; ఓ దైవప్రవక్తా(స)! నా కుమార్తె వితంతువు అయింది. నా చింతనంతా ఆమె వివాహం గురించే. ఆమెను వివాహం చేసుకోవాల్సిందిగా అబూ బకర్(ర)ను అడిగాను. కాని ఆయన మౌనంగా ఉండిపోయారు. ఇదే విషయాన్ని నేను ఉస్మాన్(ర) దగ్గర కూడా ప్రస్తావించాను. ఆయన కూడా సంతృప్తికరమైన సమాధానం ఇవ్వలేదు.

విశ్వకారుణ్యమూర్తి (స) ఖిన్నుడై ఉన్న, విశ్వాసపాత్రుడైన తన ప్రాణస్నేహితునితో ఇలా అన్నారు; అబూబకర్(ర) కంటే ఉస్మాన్(ర) కంటే ఉత్తముడైన మరొక వ్యక్తికిచ్చి మీ కూతురి వివాహం ఎందుకు చెయ్యరు? మీ కూతురికంటే ఉత్తమురాలైన మరొక స్త్రీతో ఉస్మాన్ వివాహం జరగాలి.

అనురాగమూర్తి అయిన దైవప్రవక్త(స) తరపునుంచి ప్రేమపూరితమైన ఈ సూచనను విన్న హజ్రత్ ఉమర్(ర) ఆనంద పారవశ్యంలో మునిగిపోయారు. ఆయన(ర) గారి విచారం, సంతోషంగాను, ఆయనగారి ఆందోళన ప్రశాంతతగాను మారిపోయింది.

తండ్రిని వైధవ్యంతో దుఃఖసాగరంలో ముంచిన ఈ కూతురు మరెవరో కాదు, హజ్రత్ ఉమర్ ఫారూఖ్(ర)గారి కుమార్తె సయ్యద హఫ్సా. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారు ఆమెను వివాహమాడటానికి సుముఖత చూపడం ఆమె అదృష్టానికి పరాకాష్ట. ఈ విధంగా ఆమె(ర) గారు మహోన్నతమైన 'విశ్వాసుల తల్లి' స్థానాన్ని అలంకరించారు. వాస్తవానికి ఇది ఒకరకంగా మహిళా వర్గం యొక్క మేరాజ్.

సయ్యద హఫ్సా(ర)గారి మొదటి వివాహం హజ్రత్ ఖనైస్ బిన్ హుజాఫతో జరిగింది. ఈ యువకుడు ఇస్లామ్ ధర్మ ప్రారంభ దశలోనే దైవప్రవక్త(స)గారి దైవదౌత్యాన్ని స్వీకరించి ధర్మంలో చేరారు. దైవమార్గంలో కలిగిన కష్టాలను, నష్టాలను ధైర్యంతో ఎదుర్కొన్నారు. విశ్వాస రక్షణ కోసం తన పట్టణాన్ని, బంధువుల్ని వదిలి తన ఇద్దరు సోదరులతో హబష్‌కు వలసపోయారు. దైవప్రవక్త(స)గారి హిజ్రత్‌కు ముందు మక్కా పట్టణానికి మరలివచ్చారు. ఆ తరువాత భార్య హజ్రత్ హఫ్సాతో కలిసి మదీనా పట్టణానికి వలసపోయారు.

హజ్రత్ ఖునైస్(ర) సత్యమార్గంలో ప్రాణాలొడ్డి పోరాడిన మహావీరుడు. హిజ్రీ శకం 3వ ఏట ఉహద్ జరిగింది. ఈ సంగ్రామంలో ఆయన అపూర్వమైన ధైర్యసాహసాలు ప్రదర్శించి మంది శత్రువులను పరాజయం పాలుజేశారు. కాని యుద్ధంలో తీవ్రంగా గాయపడటంతో ఆయన్ని మెరుగైన వైద్యం కోసం మదీనా తీసుకుపోయారు. చికిత్స పొందుతూనే తుది శ్వాస విడిచారు. హజ్రత్ హఫ్సా(ర) వితంతువై పోయారు.

దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) పద్ధతి ప్రకారం హజ్రత్ హఫ్సా(ర) కోసం వివాహ సందేశాన్ని పంపారు. ఆ తరువాత దైవప్రవక్త(స), హజ్రత్ హఫ్సా(ర) గార్ల వివాహం శుభప్రదంగా ఎలాంటి అట్టహాసం లేకుండా జరిగింది. నాలుగు వందల దిర్హమ్‌లు మహర్‌గా నిర్ణయించారు. హజ్రత్ హఫ్సా(ర) ప్రవక్త(స)గారి గృహంలోకి ఆయన(స)గారి ఆలిగా, విశ్వాసుల తల్లిగా ప్రవేశించారు. ఈ పవిత్ర వివాహ అనంతరం హజ్రత్ అబూ బకర్(ర) హజ్రత్ ఉమర్(ర)ను కలిశారు. ఆయన(ర) హజ్రత్ ఉమర్(ర)తో ఇలా అన్నారు; "హజ్రత్ హఫ్సా(ర)ను గురించి మీరు చేసిన ప్రతిపాదనకు నేను మౌనం వహించాను. ఎందుకంటే, దైవప్రవక్త(స)గారే స్వయంగా హజ్రత్ హఫ్సా(ర)ను గురించి ప్రస్తావించారు. ఆ సమయంలో ఈ విషయాన్ని గురించి నేను మీకు చెప్పదలుచుకోలేదు. అంతేగాని హఫ్సా(ర)తో నికాహ్‌ను తిరస్కరించటం అనేది జరుగలేదు".

దైవప్రవక్త(స), హజ్రత్ హఫ్సాల నికాహ్ షాబాన్ నెల హిజ్రీ శకం3లో జరిగింది. అప్పుడామె గారి వయస్సు ఇరవై రెండేళ్ళు.

హజ్రత్ హఫ్సా(ర) దైవప్రవక్త(స)గారి పవిత్ర గృహంలోకి గృహిణిగా ప్రవేశించినప్పుడు అక్కడ అదృష్టవంతులైన ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. వారు కూడా ఆ గృహ సామ్రాజ్యానికి మహారాణులే. ఒక స్త్రీ విశ్వాసుల తల్లి అయిన హజ్రత్ సౌదా(ర)అయితే మరొక స్త్రీ విశ్వాసుల తల్లి అయిన హజ్రత్ ఆయెషా(ర). అప్పుడు హజ్రత్ సౌదా(ర)గారి వయస్సు అరవై సంవత్సరాలు. హజ్రత్ ఆయెషా(ర)గారు నవ యవ్వనంలో ఉన్నారు.

దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా సెలవిస్తూ ఉండేవారు; 'పేదరికం నా ఇంటి లక్షణం, నా గృహం ప్రత్యేకత' ఆయన(స) గారి గృహ లక్షణాలు, దాని వాతావరణం ఆయన(స) గారు చెప్పినట్లుగానే ఉండేది. ఈ ఇంట్లో నివాసముండే ప్రతి గృహిణికి ఒక 'హుజ్‌రా' ఒక 'గది' కేటాయించబడుతుంది. ఆ గది గోడలు పచ్చిఇటుకలతో కట్టబడ్డాయి. ఆ ఇంటి కప్పు ఖర్జూరపు కొమ్మలతో కప్పబడింది. తలుపులకు కంబళ్ళు పరదాలుగా కట్టబడి ఉన్నాయి. ఇలాంటి ఒక హుజ్‌రాయే విశ్వాసుల తల్లి హజ్రత్ హఫ్సా(ర)కూ కేటాయించారు. అది మసీదుకు తూర్పువైపున ఉంది. ఈ గదిలో చాలా కొద్దిపాటి సామాను మాత్రమే ఉంది. ఆమె(ర)గారి హుజ్‌రాలో దైవప్రవక్త(స) గారి విశ్రాంతి కోసం ఏర్పాటు చెయ్యబడిన పడక, ఒక జనుపనార సంచి మాత్రమే ఉండేవి. ఖర్జూరపు పండ్లు,పాలు తరచూ ఆహారంగా తీసుకునేవారు. వారాలపాటు పొయ్యి రాజెయ్యబడేది కాదు.

విభిన్న ఉల్లేఖనాల ద్వారా తెలిసే విషయం ఏమిటంటే, హజ్రత్ హఫ్సా(ర) స్వభావంరీత్యా దుడుకు మనస్తత్వం కలవారు. అంటే మాటల్లో, చేతల్లో వేగం ఎక్కువ. ఈ మనస్తత్వం ఆమె(ర)గారి వంశానికున్న ప్రత్యేకత. అప్పుడు అరబ్బు సమాజంలో ప్రత్యేకంగా ఖురైష్‌తెగలో భార్యల్ని అణిచిపెట్టేవారు. వారికి ఎలాంటి హక్కులూ ఉండేవికావు. భార్య భర్త ముందు నిర్మొహమాటంగా, నిర్భయంగా నిలబడి మాట్లాడగలిగేవారు కాదు, వారికి అభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛఉండేది కాదు. వ్యాపార విషయాలలో కుటుంబానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీల్లో భార్యను సంప్రదించే ఆచారం ఉండేదికాదు. భర్తకు మంచి సలహాలు ఇచ్చే ధైర్యం కూడా భార్యకు ఉండేదికాదు.

చివరి దైవప్రవక్త ముహమ్మద్(స) ప్రపంచ మానవులందరికీ శ్రేయోభిలాషిగా, మహోపకారిగా వచ్చారు. ఆయన(స)గారు స్త్రీల వ్యక్తిత్వాన్ని, వారి గౌరవ మర్యాదలను, వారి హక్కులను పరిరక్షించటానికి అసంఖ్యాకమైన సంస్కరణలు చేపట్టారు. అదే సమయంలో ఆయన(స)గారు తన భార్యలపట్ల సద్భావంతో, ప్రేమానురాగాలతో మెలిగి ఒక ఆదర్శ ప్రమాణాన్ని నెలకొల్పారు. స్త్రీలకు ఆయన(స) గారు తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచే పూర్తి స్వేచ్ఛను అందించారు. ఆయన(స)గారి భార్యలు తమ అవసరాలను, తమ కోరికలను, తమ అభిప్రాయాలను నిర్భయంగా దైవప్రవక్త(స) గారి ముందు వ్యక్తపరచడమే దీనికి నిదర్శనం. ఆర్థిక, సామాజిక, రాజకీయ విషయాలలో వారు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా ప్రవక్త(స)గారికి నివేదించేవారు.

హజ్రత్ ఉమర్(రజిఅన్)గారి ఈ క్రింది ఉల్లేఖనాన్ని చూస్తే పరిస్థితి మరింత స్పష్టమవుతోంది. హజ్రత్ ఉమర్(ర) ఇలా అన్నారు; దేవునిపై ప్రమాణంచేసి చెబుతున్నాను. మేము అజ్ఞానకాలంలో స్త్రీల స్థానాన్ని వారి విలువను, వారి గౌరవ మర్యాదలను, వారి హక్కుల్ని నిర్లక్ష్యం చేశాము. అల్లాహ్ స్త్రీలను గురించి ఎన్నో ఆదేశాలు అవతరింపజేశాడు. వారికి ఎన్నో హక్కుల్ని ప్రసాదించాడు. నేను ఒక రోజున ఇంట్లో కూర్చుని ఏదో పనిని గురించి ఆలోచిస్తూ ఉన్నాను. ఇంతలో నా భార్య నా దగ్గరకు వచ్చి ఇలా అన్నది; మీరుగనుక ఈ విధంగా చేసి ఉంటే, ఇది చేసి ఉంటే బాగుండేది. అప్పుడు నేను ఆమెతో ఇలా అన్నాను; ఈ విధంగా మాట్లాడే హక్కు నీకు లేదు. అసలు నీవు ఇక్కడకు ఎందుకు వచ్చావు? నేను చేయదలుచుకున్న పనిలో నీవెందుకు జోక్యం చేసుకుంటున్నావు? అప్పుడు ఆమె నాతో ఇలా అన్నది; ఓ ఇబ్నె ఖత్తాబ్! మిమ్మల్ని చూస్తే ఆశ్చర్యం కలుగుతోంది. మీతో ఎవరూ మాట్లాడకూడదా? మిమ్మల్ని ఎలాంటి ప్రశ్నను అడగకూడదా? మీ ప్రియపుత్రిక దైవప్రవక్త(స)గారిని కూడా ఎన్నో ప్రశ్నలు అడుగుతోంది. ఒక్కొక్కసారి పరిస్థితి ఎంతవరకు పోతుందంటే, ఆ రోజంతా కోపమే ఆ ఇంట్లో రాజ్యమేలుతుంది. ఈ మాటలు విని నేను అప్పటికప్పుడే నా దుప్పటి తీసుకుని లేచినిలబడ్డాను. హఫ్సా(ర) ఇంటికి వెళ్ళాను. ఆమెను ఇలా అడిగాను;

"ఓ నా కూతురా! నీవు దైవప్రవక్త(స)గారిని ప్రశ్నలలో వేధిస్తున్నావా? ఈ కారణంగా ఆయన(స) ఆ రోజంతా ఆగ్రహంతో ఉంటున్నారా?' హజ్రత్ హఫ్సా(ర) ఇలా అన్నారు; దేవుని సాక్షిగా! మేము పరస్పరం మాట్లాడుకుంటూ ఉంటాము. సంభాషించుకుంటూ ఉంటాము'. అప్పుడు నేను ఇలా అన్నాను, బాగా జ్ఞాపకముంచుకో, ఇది మంచి పద్ధతి కాదు. నేను అల్లాహ్ విధించే శిక్షను గురించి. దైవప్రవక్త(స)గారి ఆగ్రహం గురించి నిన్ను హెచ్చరిస్తున్నాను. ఓ నా కూతురా! నీవు ఆమెను చూసి మోసంలో పడబోకు. ఆమె తన అందాన్నీ, ప్రవక్త(స)గారి ప్రేమను చూసుకుని గర్వపడుతోంది. (అంటే విశ్వాసుల తల్లి హజ్రత్ ఆయెషా(ర))

హజ్రత్ హఫ్సా(ర) దుడుకు స్వభావంగల వనిత అయినప్పటికీ, తన చిత్తశుద్ధివల్ల తన విశ్వాస పటిమ వల్ల, తన భయభక్తుల మూలంగా, తాను చేసే ఆరాధనల వల్ల, ప్రవక్త(స) పట్ల తనకున్న ప్రేమ వల్ల, తన భర్త(స) పట్ల ఉన్న విధేయత వల్ల దేవుని సన్నిధానంలోఆమెకు ఉన్నతమైన స్థానం లభించింది. ఈ విషయం ఒక హదీసు వల్ల ప్రస్ఫుటమవుతోంది; ఒకసారి హజ్రత్ జిబ్రీల్(అ) దైవప్రవక్త(స) గారి వద్దకు వచ్చారు. హజ్రత్ హఫ్సా(ర)ను గురించి ఈ మాటలు అన్నారు; ఆమె(ర) అత్యధికంగా ఆరాధనలు చేస్తారు; ఆమె(ర)అత్యధికంగా ఉపవాసాలు ఉంటారు. ఓ దైవప్రవక్తా(స)! స్వర్గంలో కూడా ఆమె(ర) గారు మీ భార్యగానే ఉంటారు."

విశ్వాసుల తల్లి హజ్రత్ హఫ్సా(ర)గారికి ఓ ప్రత్యేకత ఉంది; అదేమిటంటే, చేత్తో రాయబడిన ఖుర్ఆన్ గ్రంథం ఒకటి ఆమె(ర)గారి వద్ద ఉంది. దానిని ఆమె(ర)గారు ప్రాణంకంటే కూడా ఎక్కువగా చూసుకునేవారు. భద్రంగా దాచుకునేవారు.

విశ్వాసుల తల్లి హజ్రత్ హఫ్సా(ర) 63ఏళ్ళ వయస్సులో హిజ్రీ నలభై ఐదవ సంవత్సరంలో మదీనా పట్టణంలో దివంగతులయ్యారు. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్. మదీనా పట్టణ గవర్నర్ 'మర్వాన్' నమాజె జనాజా చేయించారు. కొంతదూరం వరకు ఆయన జనాజాను తన భుజం మీద మోశారు. ఆ తరువాత హజ్రత్ అబూహురైర(ర) జనాజాను సమాధి వరకు తీసుకువెళ్ళారు. ఆ తరువాత హజ్రత్ హఫ్సా(ర) గారి సోదరుడు హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్(ర), ఇతర దాయాదులు ఆమె(ర)గారి భౌతికకాయాన్ని సమాధిలోకి దించారు. సయ్యద హజ్రత్ హఫ్సా(ర) అపారమైన ధర్మజ్ఞానం కలవారు కూడా. ఆమె(ర)గారు అరవై హదీసుల్ని ఉల్లేఖించారు.

తఫ్‌హీముల్ ఖుర్ఆన్-3 (ఖుర్ఆన్ అవగాహనం) మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది

64 ఆయత్‌లు　　　　　　　　　　　　　　　　　　　　మదీనా అవతరణ

# 24. అన్ నూర్

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

35 - 40 అల్లాహ్[61] గగన భువనాల వెలుగు.[62] (విశ్వంలో) ఆయన వెలుగుకు ఉపమానం ఎలా ఉంటుందంటే, గూటిలో దీపమున్నట్లు, దీపం ఒక గాజు బుగ్గ లోపల ఉన్నట్లు, గాజు బుగ్గ ఏమో ముత్యంలా మెరుస్తూ ఉన్నటువంటి తారవంటిది, మరి ఆ దీపమేమో ఒక శుభప్రదమయిన జైతూన్ చెట్టు చమురుతో వెలిగించబడుతున్నట్లు, ఆ చమురు, ప్రాక్‌జనీనమూ కానటువంటిది, పశ్చిమ జనీనమూ కానటువంటిది నిప్పు అంటినా అంటకపోయినా దాని చమురు దానంతట అదే రగుల్కొంటున్నటువంటిది, (ఇలా) వెలుగు పైన వెలుగు (పెరిగే సకల సాధనాలూ సమాయత్తమయినటువంటిది).

*(పాదసూచిక 61 గత సంచిక తరువాయి)*

వీరు తాము విశ్వసించినట్లు ప్రకటించేవారు, ముస్లిములలో కలసి ఉండేవారు, ముస్లిములతోపాటు, ముఖ్యంగా అన్సారులతోపాటు బంధుత్వాలు, సంబంధాలు కలిగినవారు. అందువల్లనే ముస్లిముల్లో ఉపద్రవాలు సృష్టించే అవకాశాలు మెండుగా వారికి దొరికేవి. కొందరు విష్కల్మష హృదయులయిన ముస్లిములు సయితం తమ సాదా సీదాతనం చేత, లేదా బలహీనత కారణంగా వారికి పని ముట్టుగా, అండదండలుగా కూడా మారిపోవడం కద్దు; కాని వాస్తవంగా ఈ కపటుల ప్రపంచ వ్యామోహం వారి కళ్ళకు గంతలు కట్టివేసింది. ఈమాన్ (విశ్వాసం) ప్రకటించినప్పటికీ, ఖుర్ఆన్ ద్వారా, మహనీయ ముహమ్మద్ (స) ద్వారా ప్రపంచంలో వ్యాపిస్తున్న కాంతికి వారు బహుదూరంగా ఉంటున్నారు. ఈ సందర్భంలో వారిని సంబోధించకుండా వారిని గురించి సెలవిచ్చిన దానికంతటికీ మూడు లక్ష్యాలున్నాయి. ఒకటి, వారికి బాగా అవగతపరచాలన్నది. అల్లాహ్ కారుణ్యం, ఆయన సంరక్షణాతత్వం ప్రప్రథమంగా కోరేదేమిటంటే, దారి తప్పి తచ్చాడే ప్రతి దాసునికి, అతడు ఎంతటి దుష్టుడయినా నీచుడయినా చివరి ఘడియ వరకు అతనికి బోధపరిచే ప్రయత్నం చెయ్యడం. రెండు, విశ్వాసం కాపట్యం రెంటి వ్యత్యాసం విడమర్చి వివరించడం; బుద్ధి వివేకాలున్నా ఏ మనిషికీ ముస్లిమ్ సమాజంలోని విశ్వాసులు, ద్వంద్వనీతిపరు(మునాఫికు)లయిన వ్యక్తులమధ్య బేధం పాటించటం కష్టం కాకుండా ఉండటం; ఈ విశదీకరణ, వివరణల తరువాత కూడా ఎవరయినా కపటుల ఉచ్చులో చిక్కుకుంటే, లేదా వారికి వెన్నుదన్నుగా నిలుస్తే అతడు తన ఈ చర్యకు తానే పూర్తిగా బాధ్యుడయిపోతాడు. మూడు, మునాఫికులను (కపట విశ్వాసులను) అతి స్పష్టంగా హెచ్చరించడం, తద్వారా అల్లాహ్ విశ్వాసులకు చేసిన వాగ్దానాలు కేవలం నిష్కల్మష హృదయంతో విశ్వసించి ఆ విశ్వాసపు అవసరాల కనుగుణంగా నడచుకునే వారికే చెల్లుతాయన్న విషయం తెలుపడం. ఈ వాగ్దానాలు, కేవలం ముస్లిముల జనాభా లెక్కలలో చేరి ఉంటే వారందరికీ వర్తించవు. కనుక మునాఫికులు (కపటులు), ఫాసికులు (దైవాజ్ఞల్ని ఉల్లంఘించేవారు) ఈ వాగ్దానాలలో ఏదయినా భాగం పొందగలమని ఆశలు పెట్టుకోరాదని తెలుపడం.

62. భూమీ ఆకాశాలు అన్న పదం దివ్యఖుర్ఆన్‌లో సర్వసాధారణంగా 'విశ్వం' అనే అర్థంలో ప్రయోగించబడుతుంది. అందువల్ల మరో విధంగా ఆయత్ అనువాదం, అల్లాహ్ విశ్వాన్నంటికీ వెలుగు అని కూడా కావచ్చు.

కాంతి అంటే భావం వస్తువులు దేని మూలంగా వ్యక్తమవుతాయో ఆ పదార్థం అన్నది. అంటే అది స్వయంగానూ వ్యక్తమవుతుంది ఇతర పదార్థాలనూ వ్యక్తపరుస్తుంది. మానవుని మస్తిష్కంలో కాంతి, వెలుగు అన్న వాటి అసలు భావం ఇదే. ఏమీ కానరాని స్థితిని మానవుడు చీకటి, అంధకారం, తిమిరం అని పేరుపెట్టాడు. దీనికి భిన్నంగా అంతా కనిపించగానే ప్రతిదీ వ్యక్తమవగానే మనిషి వెలుతురు వచ్చేసిందని అంటాడు. పరమ ప్రభువు అల్లాహ్‌కు 'కాంతి' అనే పదం ఈ ప్రాథమిక భావంలోనే ప్రయోగించడం జరిగింది. దైవం మన్నించుగాక ఆయనేదో కాంతి కిరణం అనే భావంలో కాదు. కాంతికిరణం ఒక్క సెకెనుకు ఒక లక్షా 36 వేల మైళ్ళ వేగంతో ప్రయాణిస్తుంది, మన కంటి తెరపై పడి మెదడులోని దృష్టికేంద్రాన్ని ప్రభావితం చేస్తుంది. వెలుగుకు ఉన్న ఈ ప్రత్యేక స్థితి వేరు. ముస్లిములతోపాటు, ముఖ్యంగా అన్సారులతోపాటు బంధుత్వాలు, సంబంధాలు కలిగినవారు. అందువల్లనే ముస్లిముల్లో ఉపద్రవాలు సృష్టించే అవకాశాలు మెండుగా వారికి దొరికేవి. కొందరు విష్కల్మష హృదయులయిన ముస్లిములు సయితం తమ సాదా సీదాతనం చేత, లేదా బలహీనత కారణంగా వారికి పని ముట్టుగా, అండదండలుగా కూడా మారి పోవడం కద్దు; కాని వాస్తవంగా ఈ కపటుల ప్రపంచ వ్యామోహం వారి కళ్ళకు గంతలు కట్టివేసింది. ఈమాన్ (విశ్వాసం) ప్రకటించి నప్పటికీ, ఖుర్ఆన్ ద్వారా, మహనీయ ముహమ్మద్ (స) ద్వారా ప్రపంచంలో వ్యాపిస్తున్న కాంతికి వారు బహుదూరంగా ఉంటు న్నారు. ఈ సందర్భంలో వారిని సంబోధించకుండా వారిని గురించి సెలవిచ్చిన దానికంతటికీ మూడు లక్ష్యాలున్నాయి. ఒకటి, వారికి బాగా అవగతపరచాలన్నది.

*(పాదసూచిక 62మిగతా వచ్చే సంచికలో)*

అదుగుజాడలు

*మహాకరుణ కలవాడు, అత్యంత దయామయుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.*

# సహీహ్ బుఖారి

**ఉర్దూ అనువాదం : హజ్రత్ అల్లామా వహీదుజ్జమా (ర.అలై)** **తెలుగు అనువాదం : షేఖ్ హమీదుల్లా షరీఫ్**

# జనాయిజ్ గ్రంథం

## 88వ అధ్యాయం

**మృతునికి ఉదయం, సాయంత్రం రెండు వేళల్లో అతని నివాస స్థలం (స్వర్గంలో, నరకంలో) చూపించబడుతుంది.**

461. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెల విచ్చారని, అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఉల్లేఖించారు; మీలో ఎవరైనా మరణించినప్పుడు, అతనికి ఉదయం, సాయంత్రం రెండు వేళల్లోనూ తన నివాస స్థలం చూపించ బడుతుంది. ఒకవేళ అతను స్వర్గవాసులలోని వాడైతే అతనికి స్వర్గంలో తన నివాసం ఏదో చూపించబడుతుంది. ఒకవేళ అతను నరకవాసి అయితే అప్పుడు అతనికి నరకంలో అతని నివాసస్థలం ఏదో చూపించబడుతుంది. అప్పుడు అతనితో ఇలా అనటం జరుగుతుంది; అల్లాహ్ నిన్ను ప్రళయం నాడు బ్రతికించి లేపేవరకు ఇది నీ నివాస స్థలంగా ఉంటుంది.

## 89వ అధ్యాయం

**శవం వాహనంపై పెట్టినప్పుడు మృతుడు మాట్లాడటం.**

462. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) ఉల్లేఖిం చారు; జనాజా తయారైనప్పుడు, తరువాత జనులు దానిని తమ భుజాలపైకి ఎత్తుకున్నప్పుడు - ఒకవేళ అతను ధర్మ పరాయణుడు అయినట్లయితే ఇలా అంటాడు; నన్ను ముందుకు తీసుకువెళ్ళండి. ఒకవేళ అతను సజ్జనుడు కాకపోయినట్లయితే ఇలా అంటాడు. అయ్యో! నేను నాశన మైపోను. నా జనాజాను ఎక్కడకు తీసుకుపోతున్నారు. అతని కంఠస్వరాన్ని మనుషులు తప్ప సృష్టిలోని జీవరాశులన్నీ వింటాయి. ఒకవేళ అతని కంఠాన్ని మనిషి గనుక వింటే, ఆ మనిషి స్పృహ కోల్పోతాడు.

## 90వ అధ్యాయం

**యుక్త వయస్సుకు ఇంకా చేరని, మరణించిన ముస్లిమ్ పిల్లలు ఎక్కడ ఉంటారు?**

దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చా రని, అబూహురైర(ర) ఉల్లేఖించారు; ఒక ముస్లిమ్‌కు చెందిన ముగ్గురు మగ పిల్లలు మరణించినట్లయితే వారు పాపాలు చేసే వయస్సుకు ఇంకా చేరకుండా ఉంటే అప్పుడు వారు ఆ ముస్లిమ్‌కూ, నరకానికీ మధ్య అడ్డంగా నిలబడ తారు. లేదా వారు స్వర్గానికి పోతారు.

463. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, అనస్ బిన్ మాలిక్(ర) ఉల్లేఖించారు; ఒక ముస్లిమ్‌కు చెందిన ముగ్గురు మగపిల్లలు మరణించి నట్లయితే ఇంకా వారు పాపాలు చేసే వయసుకు చేరకుండా ఉంటే, అప్పుడు అల్లాహ్ వారి పట్ల తనకు ఉన్న కారుణ్యం వల్ల వారిని స్వర్గంలోకి ప్రవేశింపజేస్తాడు.

464. బరా బిన్ ఆజిబ్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి కుమారుడైన హజ్రత్ ఇబ్రాహీం దివంగతులైనప్పుడు దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; స్వర్గలోకంలో అతనికి పాలు త్రాపటానికి ఒక స్త్రీ ఉన్నారు.

## 91వ అధ్యాయం

**యుక్త వయస్సుకు ఇంకా చేరని ముష్రిక్కుల సంతానం గురించి.**

465. హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారిని ఇలా అడగటం జరిగింది. ఓ దైవప్రవక్తా(స)! ముష్రిక్కుల సంతానం పరలోకంలో ఎక్కడ ఉంటారు; సమాధానంగా ఆయన(స)గారు ఇలా సెలవిచ్చారు; వారిని అల్లాహ్‌యే సృష్టించాడు కాబట్టి ఆయనకే ఈ విషయం బాగా తెలుసు. వారు పెద్దవారైన తరువాత ఎలాంటి పనులు చేస్తారో.

466. హజ్రత్ అబూహురైర(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)ను ఇలా అడగటం జరిగింది; ముష్రిక్కుల సంతానం మరణానంతరం ఎక్కడ ఉంటారు? ఆయన(స) ఇలా సెలవిచ్చారు; వారు ఎలాంటి పనులు చేసేవారో అల్లాహ్‌కే బాగా తెలుసు.



# నా హృదయం కంపించిపోయింది

## బల్బీర్‌సింగ్ (ముహమ్మద్ ఆమిర్)తో ముఖాముఖి

బాబరీ విధ్వంసంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తి అతడు. మస్జిద్ కూల్చడానికి తొలిరాయి కూడా వేసిందతడే. ఆ తరువాత కొంతకాలానికి అతను పశ్చాత్తాపపడ్డాడు. చేసిన పాపానికి కుమిలిపోయాడు. నెమ్మదిగా ఇస్లాం అధ్యయనం చేశాడు. ఇప్పుడు అల్లాహ్ కారుణ్యానుగ్రహాల ఛాయల్లో సేదతీరుతున్నాడు. అతడే బల్బీర్‌సింగ్ ఉరఫ్ ముహమ్మద్ ఆమెర్. ఆయన ఇటీవల కరీంనగర్ పర్యటించిన సందర్భంలో గీటురాయి **రచయిత అబుల్ ఫౌజాన్** ఆయనతో జరిపిన ఇంటర్వ్యూను మీకందిస్తున్నాము.

**ప్రశ్న: మీ విద్యాభ్యాసం, కుటుంబం, తల్లి దండ్రుల గురించి తెలుపండి**

**జవాబు :** నా పేరు బల్బీర్‌సింగ్. మేము రాజ పుత్ర కుటుంబానికి చెందినవాళ్ళం. నేను ఇంగ్లీషులో ఎం.ఎ చేశాను. హిస్టరీ, పొలిటికల్ సైన్స్‌లో కూడా ఎం.ఎ. చేశాను. హర్యానాలోని పానిపట్టు జిల్లాకు చెందిన ఒక గ్రామంలో 1970 డిసెంబర్ 6న జన్మించాను. మా నాన్న గారు మా గ్రామంలోని ఒక ప్రైమరీ స్కూల్‌కు హెడ్‌మాస్టర్. ఆయన చాలా మంచి మనిషి. మానవత్వం ఆయన ధర్మం. హింసా దౌర్జన్యా లంటే ఆయనకు ఏవగింపు. 1947 విభజన సమయంలో జరిగిన మారణకాండను ఆయన తన కళ్ళతో తిలకించారు. ఆ విష యాల్ని ఆయన అత్యంత దుఃఖావేదనలతో వినిపించేవారు. దాన్ని దేశానికి కళంకంగా అభి వర్ణించేవారు. బ్రతికి బయటపడ్డ ముస్లింల పునరావాసానికి ఎంతో ప్రయత్నించేవారు. గ్రామంలో మెట్రిక్ పూర్తి చేసి ఇంటర్మీడియేట్ కొరకు పానిపట్టు వెళ్ళాను. ముంబాయి తరు వాత బహుశ పానిపట్టే శివసేనకు కంచుకోట అనుకుంటాను. ప్రత్యేకించి విద్యార్థులు, యువతరంపై శివసేన ప్రభావం ఎక్కువగా ఉండేది. అక్కడి శివసైనికులతో నాకు స్నేహం ఏర్పడింది. పానిపట్టు చరిత్ర నేపథ్యంలో అక్కడి యువకుల్లో ముస్లింలు, ముస్లిం పాలకులకు వ్యతిరేకంగా అత్యధిక విషం నింపడం జరిగింది. నేను శివసేనలో చేరిన విషయం మా నాన్నగారికి తెలిసినప్పుడు ఆయన నన్ను వారించ ప్రయత్నించారు. చరిత్ర ఆధారంగా నన్ను నచ్చజెప్పడానికి ఎంతో ప్రయత్నించారు. బాబరు ప్రత్యేకించి ఔరంగజేబు ఎంత న్యాయంగా పరిపాలిం చాడో, హిందువుల పట్ల అతని మేలైన ప్రవర్త నకు సంబంధించిన కథలు వినిపించి, ప్రస్తుత చరిత్ర ఆంగ్లేయుల ద్వారా రాయించబడిన కలుషిత చరిత్ర అని, హిందు ముస్లింలను విడదీసి, దేశాన్ని బలహీనపర్చడానికి పథకం ప్రకారం రూపొందించిన వైనాన్ని వివరించారు. 1947లో జరిగిన హింసా దౌర్జన్యాల సంఘట నల్ని వినిపించి, నన్ను శివసేనలో చేరవద్దని ఎంతో నచ్చజెప్పారు. అయినా ఆ సమయంలో అవేవీ నా తలకెక్కలేదు.

**ప్రశ్న : బాబ్రి మస్జిద్ విధ్వంసానికి మిమ్మల్ని పురగొల్పిన విషయమేది? ఆ రోజు జరిగిన సంఘటనలో మీ పాత్ర ఏమిటి?**

**జవాబు:** 1990లో అద్వానీజీ జరిపిన రథ యాత్ర సందర్భంగా పానిపట్టులో నాకు పెద్ద బాధ్యతే అప్పగించారు. రథయాత్ర జరిపిన ప్రముఖులు మా నరనరాల్లో ముస్లిం వ్యతిరేక తను నింపారు. ఎవరేం చేసినా చేయక పోయినా, నేను మాత్రం ఒంటరిగానైనా వెళ్ళి రామమందిరంపై నిర్మించిన ఆ కట్టడాన్ని నేలకూల్చనిదే నిదురపోనని శివాజీ మహరాజ్ సాక్షిగా ప్రతినబూనాను. ఈ యాత్రలో నా పనితనాన్ని గుర్తించి శివసేన యూత్‌వింగ్‌కు



ముహమ్మద్ ఆమిర్‌తో రచయిత అబుల్ ఫౌజాన్

**నేను ఆనందోత్సాహాలతో ఇంటికొచ్చాను. కాని నాన్నగారు ఎంతో అసంతృప్తి చెందారు. అమితంగా బాధపడ్డారు. నిర్మోహమాటంగా నాతో ఇలా అన్నారు : 'ఇప్పుడు ఈ ఇంట్లో మనిద్దరం కలిసి ఉండలేము. నీవే గనుక ఈ ఇంట్లో ఉండదలిస్తే నేను ఇల్లు విడిచి వెళ్ళిపోతాను. లేదంటే నీవే ఇల్లు విడిచి వెళ్ళిపో! దైవ గృహాన్ని విధ్వంసం చేసినవాని ముఖం కూడా నేను చూడదలుచుకోలేదు. నేను చచ్చేంతవరకు నీ ముఖం నాకు చూపించకు' అంటూ చాలా తీవ్రంగా స్పందించారు.**

అధ్యక్షునిగా నియమించారు.

చివరికి మేము వేయికళ్ళతో ఎదురు చూసిన ఆ రోజు, 1992 డిసెంబర్ నెల రానే వచ్చింది. మేమందరం డిసెంబర్ 6వ తేదీ ముందు రాత్రి బాబ్రీ మసీదుకు అత్యంత సమీపానికి చేరుకున్నాం. మసీదు ముందున్న ముస్లింల ఇళ్ళ కప్పులపై ఆ రాత్రి గడిపాం. తెల్లారగానే మాలో ఆత్రుత పెరగసాగింది. ఈ నాయకులు ఈసారైనా ఏదైనా చేస్తారా లేదా అని మాకు పరిపరి విధాల ఆలోచనలు రాసాగాయి. అందుకని వెంటనే దిగి కరసేవ మొదలుపెట్టాలని తలంచాము. కాని మా సంచాలకుడు మమ్మల్ని ఆపేశాడు. డిసిప్లిన్‌ను పాటించాలని చెప్పాడు. అంతలో ఉమా భారతి చేసిన ప్రసంగం, కరసేవకుల్లో ఉద్రేక ఆవేశాల్ని నింపింది. ప్రసంగం ఇంకా జరుగుతుండగానే యోగేందర్‌సింగ్‌తోపాటుగా క్రిందికి దిగి, మస్జిద్ గుమ్మటం పైకెక్కాము. 'ఇంకో దెబ్బ వేయండి, బాబ్రీని కూల్చండి' అంటూ ఉమా భారతి ఇచ్చిన నినాదంతో మాలో ఆవేశం పరవళ్ళు తొక్కసాగింది. 'జైశ్రీరాం'అంటూ నినాదం చేసి మధ్య గుమ్మటంపై మొదటి దెబ్బవేశాను. అంతే! నలువైపులా విధ్వంసం మొదలయింది. కొన్ని గంటల్లోనే మస్జిద్ నేల మట్టం అయిపోయింది. మసీదు పడగొట్టిన తరువాత అక్కడ 'రాంలల్లా' విగ్రహాన్ని ప్రతిష్టించి, దాని ముందు శిరస్సు వంచి, సంతోషంగా ఇంటి ముఖం పట్టాము. మేము వచ్చేటప్పుడు మసీదుకు చెందిన రెండు ఇటుకల్ని వెంట తెచ్చుకున్నాం. వాటిని గర్వంగా, సంతోషంగా నా స్నేహితులకు చూపించాను. వాటిని పానిపట్టు స్థానిక శివసేన కార్యాలయంలో పెట్టాము. ఆ రోజే ఒక బహిరంగ సభ జరిగింది. అందులో వక్తలందరూ నన్ను ఆకాశానికెత్తేశారు. రామభక్తితో మొట్టమొదటి దెబ్బ వేసిన ఘనత పానిపట్టుకు చెందిన యువ శివసైనికునికి దక్కిందని, ఇదెంతో గర్వకారణమని ప్రశంసించారు. నేను ఆనందోత్సాహాలతో ఇంటికొచ్చాను. కాని నాన్నగారు ఎంతో అసంతృప్తి చెందారు. చాలా బాధపడ్డారు. నిర్మొహమాటంగా నాతో ఇలా అన్నారు: 'ఇప్పుడు ఈ ఇంట్లో మనిద్దరం కలిసి ఉండ లేము. నీవే గనుక ఈ ఇంట్లో ఉండదలిస్తే నేను ఇల్లు విడిచి వెళ్ళిపోతాను. లేదంటే నీవే ఇల్లు విడిచి వెళ్ళిపో! దైవ గృహాన్ని విధ్వంసం చేసినవాని ముఖం కూడా నేను చూడదలుచుకోలేదు. నేను చచ్చేంతవరకు నీ ముఖం నాకు చూపించకు' అంటూ చాలా తీవ్రంగా స్పందించారు. నేను అవాక్కై పోయాను. ఇలాంటి పరిస్థితిని నేను ఊహించి ఉండలేదు. నన్ను నేను సంభాళించుకొని పానిపట్టులో నాకు జరిగిన ఘన సన్మానాన్ని వివరించబోగా 'ఇలాంటి దౌర్జన్యకారుల వల్లనే ఈ దేశం నాశనమవుతుంది' అని కోపగించుకొని ఇంటి నుండి వెళ్ళిపోసాగారు. పరిస్థితిని గమనించిన నేను 'మీరెక్కడికీ వెళ్ళనవసరం లేదు. నేనే వెళ్ళిపోతాను. రామమందిరపు భక్తుణ్ణి దౌర్జన్యపరునిగా గుర్తించే ఇంట్లో నేను కూడా ఉండదలుచుకోలేదు.' అంటూ బయటికి వచ్చేశాను. ఆ తరువాత పానిపట్టుకు మకాం మార్చాను.

**ప్రశ్న: అది సరే! అంతటి రామభక్తులైన మీరు**



**ఇస్లాం వైపుకు ఆకర్షితులవడానికి కారణాలేమిటో?**

**జవాబు :** కరుణామయుడైన నా ప్రభువు, నేను కోరకపోయినప్పటికీ హింసా దౌర్జన్యాలు, విగ్రహారాధన, బహుదైవారాధనలాంటి చీకట్లలో నుండి నన్ను బయటికి తీసి సత్యధర్మం, వెలుగును చూపించాడు. దైవగృహాన్ని ధ్వంసం చేసిన నాలాంటి పాపాత్ముణ్ణి సన్మార్గంపైకి మళ్ళించాడు. అసలు జరిగిన విషయం ఏమిటంటే, మస్జిద్ విధ్వంసం తరువాత దాని బాపతు రెండు ఇటుకలు తెచ్చుకున్నామని ముందే మీకు చెప్పాను. నా స్నేహితుడు యోగేందర్ సింగ్ వాటిని ఒక చోట ప్రదర్శించి 'దౌర్జన్యానికి ప్రతీక అయిన ఆ కట్టడపు ఇటుకలు అదృష్టవశాత్తు మా చేతికి చిక్కాయి. హిందూ సోదరులందరూ వచ్చి వాటిపై మూత్రదానం చేయాలని మైక్‌లో చెప్పసాగాడు. ఇంకేముంది? పెద్ద జనసమూహమే ప్రోగయింది. ఒక్కొక్కరూ వచ్చి దానిపై మూత్రం పోయసాగారు... తన గృహానికి జరిగిన ఇంతటి అపచారాన్ని ఆ పరాత్పరుడు ఎలా సహించగలడు? నాలుగైదు రోజులు కూడా గడువలేదు. యోగేందర్‌సింగ్‌కు మతి చలించిపోయింది. బట్టలన్నీ విప్పేసి నగ్నంగా తిరుగసాగాడు. అతని చేష్టలకు అతని తండ్రి కలవరపడిపోయారు. వైద్యం చేయించారు. తాంత్రిక బాబాలకు చూపించారు. మౌలానాలనబడే ముస్లిం గురువులకూ చూపించారు. పదేపదే దైవానికి క్షమాపణలు వేడుకునేవారు. విరివిరిగా దానధర్మాలూ చేశారు. కాని అతని పరిస్థితి కుదుటపడడానికి బదులు ఇంకా చెడిపోసాగింది. ఒకరోజు తండ్రి ఇంట్లో లేని సమయంలో తల్లిని బలాత్కరించడానికి ప్రయత్నించాడు. ఆమె కేకలు విని ఇరుగు పొరుగువారు పరుగెత్తుకొచ్చారు. పరిస్థితిని గమనించి అతన్ని సంకెళ్ళతో బంధించారు. యోగేందర్ తండ్రి అత్యంత పరపతి, గౌరవం

గల వ్యక్తి. ఆయన ఈ అవమానాన్ని సహిం చలేకపోయారు. యోగేందర్ సింగ్‌ను తుపాకీతో కాల్చి చంపాలనే నిర్ణయానికి వచ్చారు. అదే సమయంలో ఎవరో సలహా ఇచ్చారు. 'మన సమీపంలోఉన్న సోనిపత్‌లోని మదర్సాకు ఒక పెద్ద మౌలానాగారు వస్తుం టారు. ఒకసారి ఆయన్ను కలువండి. ఏదైనా పరిష్కారం దొరక్కపోతే మీ ఇష్టం వచ్చినట్లు చేద్దురుగానీ' అంటూ నచ్చజెప్పారు. ఆయన సరేనని సోనిపత్‌కెళ్ళారు. అయితే మౌలానా అంతుకు క్రితం రోజే వచ్చిపోయారని తెలిసి బాగా నిరుత్సాహపడ్డారు. ఆయన పరిస్థితిని గమనించిన అక్కడి ఓ దుకాణందారు, మీరు పెద్ద మౌలానాను అర్జంటుగా కలువదలిస్తే, వచ్చే బుధవారం ఆయన ఢిల్లీలోని ఫలానా మౌలానా ఇంటికి వస్తారని తెలుపడమే కాకుండా అడ్రసు కూడా రాసిచ్చాడు. యోగేందర్‌సింగ్ తండ్రి రఘువీర్‌సింగ్ అతన్ని సంకెళ్ళతో బంధించి తనతోపాటుగా ఢిల్లీ తీసుకెళ్ళారు.

అనుకున్నట్టుగానే బుధవారం రోజు పెద్ద మౌలానా గారు అక్కడికి చేరుకున్నారు. యోగేందర్ సంకెళ్ళతో బంధింపబడి నగ్నంగా నిలబడి ఉన్నాడు. మౌలానా రాగానే రఘు వీర్‌సింగ్ ఆయన కాళ్ళ మీద పడిపోయారు. దానికి మౌలానాగారు బాగా నొచ్చుకున్నారు. లేచి నిలబడి మాట్లాడమని కాస్త కఠినంగానే ఆదేశించారు. విషయమేమిటని అడిగారు.

"మౌలానాగారు! ఆ చెడు పని చేయొద్దని మస్జిద్ కూల్చడానికి వెళ్ళొద్దని ఈ దుర్మార్గున్ని నేనెంతగానో ఆపడానికి ప్రయత్నించాను. కాని ఒక ఆవత్ వాని ప్రేరణతో ఆ దుర్మార్గానికి ఒడిగట్టాడు. మౌలానా! నాకు క్షమాభిక్ష ఇప్పిం చండి. నా ఇల్లు నాశనం కాకుండా కాపాడండి' అంటూ రఘువీర్‌సింగ్ కడు దీనంగా విలపిం చాడు.

విషయమంతా విన్న మౌలానా (మౌలానా కలీం అహ్మద్ సిద్దీఖీ-ఫులత్) ఇలా అన్నారు: "ప్రపం చాన్నంతా శాసించే సర్వశక్తి సంపన్నుడైన సృష్టికర్త గృహాన్ని ధ్వంసం చేసి ఎంత ఘోరమైన పాపానికి ఒడిగట్టారంటే, దీని శిక్షగా ప్రపంచ మంతా నాశనమైనా తక్కువే. ఇంకా నయం! దైవాగ్రహం ఇతనొక్కనిపైనే విరుచుకుపడింది. మేము కూడా ఆ పరాత్పరుని దాసులమే. ఇంతటి ఘోరమైన పాపానికి ఒడిగట్టవద్దని వారికి నచ్చజెప్పి, ఆపలేకపోయిన మేము



**కరుణామయుడైన నా ప్రభువు, నేను కోరకపోయినప్పటికీ హింసా దౌర్జన్యాలు, విగ్రహారాధన, బహుదైవారాధనలాంటి చీకట్లలో నుండి నన్ను బయటికి తీసి సత్యధర్మం, వెలుగును చూపించాడు. దైవగృహాన్ని ధ్వంసంచేసిన నాలాంటి పాపాత్ముణ్ణి సన్మార్గంపైకి మళ్ళించాడు.**

కూడా ఈ పాపంలో భాగస్వాములమే. మేమిం దులో చేసేది ఏమీ లేదు. ఇకిప్పుడు మిగిలిం దొక్కటే! మీరు నిర్మల మనస్సుతో ఆ సర్వేశ్వ రుని ముందుపడి క్షమాభిక్ష వేడుకోండి, మేము కూడా క్షమించమని ఆ పరాత్పరుని విన్నవిం చుకుంటాం. ఇదొక్కటే మార్గం. మేము మస్జిద్‌లో ప్రార్థిస్తున్నంత సేపు మీరు దైవంపై ధ్యానం పెట్టి నిష్కళంక, నిర్మల హృదయంతో దైవాన్ని ప్రార్థిస్తూ ఉండండి. 'ప్రభూ! నీవు తప్ప ఈ ఆపదను దూరం చేసే వారెవ్వరూ లేరు' అంటూ కన్నీళ్ళతో వేడుకోండి' అని సలహా ఇచ్చారు. "మౌలానా! నేనంతటి వాణ్ణయితే ఈరోజు దాపురించేదే కాదు. మీరు దైవానికి సన్నిహి తులు, ప్రీతిపాత్రులు, మీరే ఏదైనా చేయండి" అంటూ రఘువీర్ సింగ్ విలపించసాగారు. 'చూడండి చౌదరీ గారూ! మీరు చికిత్స కోసం నా వద్దకు వచ్చారు. అందుకని నేను చెప్పినట్లు చేయడం మీ విధి. చౌదరీ రఘువీర్‌సింగ్ సరేనని తలూపారు. ఆ తరువాత మౌలానా కలీం సిద్దీఖీ మస్జిద్ లోపలి కెళ్ళారు. మస్జిద్‌లో కొంచెంసేపు ప్రసంగం జరిగింది. ఆ తరువాత నమాజు చేసి ప్రార్థన కోసం, వేడుకోలు కోసం చేతులెత్తారు. "సోదరు లారా! చౌదరీగారి ఆపదను తొలగించ మని మనమందరం అల్లాహ్‌ను ప్రార్థిద్దాం' అంటూ అందరితో ప్రార్థన చేయించారు. ఆ తరువాత మస్జిద్‌లో చిన్న అల్పాహార కార్య క్రమం జరిగింది.

**(మిగతా వచ్చేవారం)**

17

# ఇస్లామ్ క్విజ్

1) హజ్రత్ ఉస్మాన్(రజి) గారి కుటుంబం ఖురైష్ వంశంలోని ఏ తెగతో సంబంధం కలిగి ఉండేది?

2) హజ్రత్ ఉస్మాన్(రజి) తల్లిదండ్రుల పేర్లేమిటి?

3) హజ్రత్ ఉస్మాన్(రజి) ఖలీఫా హోదాలో చేయించిన మొదటి నమాజు ఏది?

4) హజ్రత్ ఉస్మాన్(రజి) ఖలీఫా బాధ్యతలు స్వీకరించినవెంటనే మొదట గవర్నరుగా ఎవర్ని నియమించారు?

5) హజ్రత్ ఉస్మాన్(రజి) జీవితకాలం?

6) హజ్రత్ ఉస్మాన్(రజి) పాలనా కాలం?

7) హజ్రత్ ఉస్మాన్(రజి) గారి జనాజా నమాజు ఎవరు చేయించారు?

8) హజ్రత్ ఉస్మాన్(రజి) గారిని ఎక్కడ ఖననం చేశారు? దాని పేరేమిటి?

9) హజ్రత్ ఉస్మాన్(రజి) ఖలీఫాగా బాధ్యతలు చేపట్టిన తొలిరోజు ఏది?

10) ఖలీఫాగా హజ్రత్ ఉస్మాన్(రజి) గారి చివరి రోజు ఏది?

**జవాబులు**

1. బనూ ఉమయ్యా 2. తల్లి పేరు 'అర్వీ', తండ్రి పేరు అఫ్ఫాన్ 3. అసర్ నమాజు 4. సఅద్ బిన్ అబీ వక్కాస్(రజి) 5. 78సంవత్సరాలు (కొన్ని ఉల్లేఖనాల ప్రకారం 80 లేక 90 సంవత్సరాలు) 6. పన్నెండు సంవత్సరాలకు కొన్ని రోజులు తక్కువ 7. జబీర్ బిన్ ముత్అమ్(రజి) 8. హష్షెకోకబ్ (అంటే పూలవనం) ఇది జన్నతుల్ బఖీలోని భాగమే. 9. హి.శ. 24 ముహర్రం మాసం 1వ తేదీ 10. హి.శ. 35 జిల్‌హజ్ 18వ తేదీ శుక్రవారం

ఉమైమ సిద్దీఖ

**రాజకీయాల్లో గూండాలు, రౌడీలు చేరి పవిత్ర రాజకీయాలను కలుషితం చేస్తున్నారు. రాజకీయ పార్టీలు సైతం ఇలాంటి వారికే కొమ్ముకాస్తున్నాయి. రౌడీ ముదిరితే రాజకీయ నాయకుడు అన్న చందంగా మారింది నేటి పరిస్థితి. బాధ్యత కలిగిన మేధావులు, విద్యావంతులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రజలకు ముగ్గురు దొంగలను చూపి ఒక దొంగకు ఓటెయ్యమంటున్నారే కానీ ప్రజల మేలుకోరే ఏ ధార్మిక సంస్థా ప్రత్యామ్నాయ పవిత్ర రాజకీయ పార్టీని స్థాపించడం లేదు.**

**దేశానికి** స్వాతంత్ర్యం సిద్ధించి 63 ఏళ్లు గడిచి పోయాయి. శాస్త్ర సాంకేతిక రంగాలలో మన దేశం ఎంతో ప్రగతి సాధించింది. అయినప్పటికీ అనేక సమస్యల వలయంలో దేశ ప్రజలు ఇప్పటికీ కొట్టుమిట్టాడుతున్నారు. ఆహార అభద్రత, మంచినీటి సమస్య, మేలైన వైద్యం, ప్రాథమిక విద్య ఇప్పటికీ అందని ద్రాక్ష గానే ఉన్నాయి. సగటు ప్రజల కష్టానష్టాలు, ఇబ్బందులు, రైతుల సమస్యలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. మరోవైపు సామాజిక సమస్యలు శరవేగంగా పెచ్చరిల్లుతున్నాయి. ఆర్థిక సమస్యలు జలగల్లా పట్టిపీడిస్తున్నాయి. రాజకీయ రంగంలో అనేక రుగ్మతలు తాండవిస్తున్నాయి. నేటికీ బలహీనులపై దౌర్జన్యాలు జరుగుతున్నాయి. ఇక ఆర్థిక సమస్యల విషయానికొస్తే, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి పోయాయి. సగటు మనిషి బ్రతకడానికి నానా కష్టాలు పడవలసి వస్తోంది. రైతులు సైతం తీవ్ర సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఆర్థిక సమస్యల కారణంగా వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు ఆందోళన కరంగా ఉన్నాయి. ప్రజారోగ్యం, వైద్య రంగం విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సగటు ప్రజలకు వైద్యసదుపాయాలు ఎంతవరకు అందుబాటులోకి తెచ్చాయో వేరే చెప్పనక్కరలేదు.




ఆకలి, అసంతృప్తి, అంతరాలు, పెరిగిపోతున్నాయి. సంపదతో తలతూగే కుటుంబాలు, జీవన భద్రను కోల్పోతున్న వర్గాల మధ్య సామాజిక, ఆర్థిక అంతరాలు క్రమేపీ పెరిగి పోతున్నాయి. బిలియనీర్ల జాబితాలో భారతీయుల సంఖ్య పెరుగుతుంటే గ్రామసీమల్లో ఆకలి చావులు పెచ్చుమీరుతున్నాయి. అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు, ప్రాంతాలకు సమానంగా అందడం లేదు. ఉదార ప్రజాస్వామ్య విధానాలతో వీటిని పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగాలు ఎప్పుడో గాలికొదిలేసాయి.

ఇలా ఎన్నో సమస్యలు సగటు పౌరుడిని పట్టి పీడిస్తున్నాయి. ఇలా చెప్పుకుంటూపోతే చాంతాడంత జాబితానే తయారుచేయవచ్చు. ప్రజల అవసరాలను తీర్చే వనరులకూ మనదేశంలో కొదవలేదు. అయినప్పటికీ సగటు మనిషి సమస్యలకు పరిష్కారం లభించడం లేదు. అందుకు తగ్గ ఏర్పాట్లు జరగడం లేదు. అన్ని సమస్యలకూ మూలం నాటి, నేటి మన రాజకీయాలు. ఏ మాత్రమూ విలువలు పాటించని, అవినీతి రాజకీయ నాయకత్వం కారణంగానే సమాజంలో అనేక సాంఘీక, ఆర్థిక, సాంస్కృతిక సమస్యలు తలెత్తుతున్నాయన్నది నిర్వివాదాంశం.

స్వాతంత్ర్యం సిద్ధించిన నాటినుంచి ఇప్పటి వరకు వారసత్వ రాజకీయాల కింద ప్రజలు నలిగిపోయారు, ఇప్పటికీ నలిగిపోతున్నారంటే అతిశయోక్తి కాదేమో. అందుకు ప్రాంతీయ, జాతీయ స్థాయి పార్టీలన్నీ కారణమే. ప్రాంతం వేరు కావొచ్చు. పార్టీ వేరు కావొచ్చు. కానీ నలిగిపోతున్నది మాత్రం జనమే. ఎన్నికలు జరుగుతాయి. ఏదో పార్టీ నుంచి ఓ ప్రజాప్రతినిధికి అధికారం దక్కుతుంది. ఆయనగారు పీఠం ఎక్కుతారు. అంతే జనం గురించి మరిచేపోతారు. ఇది పవిత్ర భారతదేశంలో రాజకీయ పార్టీల అతి పురాతన నిర్వచనం. ఇప్పటికీ అదే కొనసాగుతోంది. జనం సమస్యలు మాత్రం తీరడం లేదు. మరోవైపు భారతదేశంలో ఉన్న అత్యంత దుర్భర స్థితి ఏమంటే ఇక్కడ వారసత్వ రాజకీయాలు మెండుగా, నిండుగా సాగుతాయి. పబ్బం గడుపుకుంటాయి.

ఒక కుటుంబం చేతుల్లోనే పరిపాలన పగ్గాలు నేటికి ఉన్నాయి. ఇలా మనదేశంలో వారసత్వ రాజకీయాలు కూడా ప్రజల వెనుకబాటుకు, దయనీయ జీవితాలకు కారణమవుతున్నాయన్నది కాదనలేని సత్యం.

నేడు ప్రతి వ్యక్తి ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, గౌరవాన్ని కోరుకుంటున్నాడు. నిజాయితీ, చిత్తశుద్ధి, నైపుణ్యం, నిస్వార్థపూరిత నాయకత్వం అనే ఇరుసుపైనే ప్రగతి చక్రాలు తిరుగుతాయి. నాయకత్వం అనే పునాదిపైనే జాతి అనే భవనం నిర్మితమవుతుంది. రాజకీయ, మత, నైతిక, సైద్ధాంతిక మూసలో పోతపోసిన నాయకులయితే ఎన్ని అడ్డంకు సృష్టించినా జాతిని నిర్దేశిత లక్ష్యం వైపు తీసుకెళ్లగలరు. దురదృష్టవశాత్తు మన పొలిటికల్ లీడర్స్‌కు నిజమైన ప్రగతి సూత్రాల జ్ఞానం, అవగాహన ఏమాత్రమూ లేవు. ప్రజలను గౌరవప్రదంగా, ఉన్నతంగా బతికేలా చేయగలిగేవాడే అసలు సిసలైన నాయకుడు. తన అనుచరులకు మానవ జీవిత లక్ష్యాలని ఎత్తి చూపడంలో మానసిక బలహీనుడు, చీకట్లో తచ్చాడే, అస్పష్ట భావాలు గలవాడు నాయకుడుగా ఉండరాదు. నేడు నాయకుడంటే మంచి మార్గాన్నో చెడు మార్గాన్నో ఏదో ఓ రీతిలో అధికారాన్ని హస్తగతం చేసుకుని ధనార్జన చేసే వాడన్న ఆలోచనలో ఉన్నారు జనం. సంఘ విద్రోహులు రాజకీయాలను తమ వృత్తిగా చేసుకుంటున్నారు. సులువుగా డబ్బు సంపాదించి కోటీశ్వరులయ్యే వృత్తిగా నేటి రాజకీయాలు తయారయ్యాయి.

జాతి పురోభివృద్ధికి నిజాయితీ, మంచి ఆదర్శాలు గల నాయకుడు ఎంతో అవసరం. కుల, మత విచక్షణ లేకుండా సామాన్యుల సంక్షేమం కోసం తన జీవితాన్ని, సేవలను అంకితం చేయగల నాయకత్వం ఇప్పుడు దేశానికి, జాతికి కావాలి. రాజకీయ నాయకుల లక్ష్యం అధికారాన్ని కైవసం చేసుకోవడం కాకుండా ప్రజల హృదయాలను దోచుకునేదై ఉండాలి. కుళ్లిపోతున్న సమాజాన్ని, సంస్కృతిని ప్రక్షాళనం చేసే పనిని రాజకీయ నాయకత్వం చేపట్టాలి. సామాన్యుడి తిండి, బట్ట, గూడు అన్న భౌతిక అవసరాల వరకే రాజకీయ నాయకత్వం పరిమితం కారాదు. అది సమాజ నైతిక, ఆధ్యాత్మిక అవసరాలను కూడా తీర్చేదిగా ఉండాలి. అసలైన ప్రగతి



**అన్ని సమస్యలకూ మూలం నాటి, నేటి మన రాజకీయాలు. ఏ మాత్రమూ విలువలు పాటించని, అవినీతి రాజకీయ నాయకత్వం కారణంగానే సమాజంలో అనేక సాంఘీక, ఆర్థిక, సాంస్కృతిక సమస్యలు తలెత్తుతున్నాయన్నది నిర్వివాదాంశం.**

అంటే సమాజంలో నైతికత వికాసమని భావించాలి. ప్రజలు నైతికంగా పతనమవుతుంటే పట్టనట్టుండేవాడు నిజమైన నాయకుడు కాలేడు.

నిజమైన నాయకుడు ప్రజల బలహీనతలను తనకనుకూలంగా మలచుకోడు. ఓట్లకోసం కేవలం ఎన్నికల సమయంలోనే ప్రజలను పట్టించుకునే వాడిగా ఉండడు. కొన్ని దశాబ్దాలకు ముందు రాజకీయ వృత్తి గౌరవమైన వృత్తిగా ఉండేది. అప్పట్లో రాజకీయ నాయకులను ఎంతో గౌరవించేవారు. ప్రజలు నాడు నాయకులను తమ శ్రేయోభిలాషులుగా భావించేవారు. కానీ నేడు దురదృష్టవశాత్తు రాజకీయాల్లోకి నేరస్తులు వస్తూపోతున్నారు. రాజకీయాల్లో బాధ్యతాయుతంగా మసిలేవారు కరువయ్యారు. ప్రస్తుతం మన నాయకులు నిర్దయగా, దౌర్జనపరులుగా ఉంటూ సమాజాన్ని నరకప్రాయం చేస్తున్నారు.

రాజకీయాలు సాంఘికాభివృద్ధి సిద్ధాంతాల విషయంలో సామాన్యులను చైతన్యపరచాలి. ఇందుకు అంకితభావం, చిత్తశుద్ధి ఉండాలి. మంచి సౌశీల్యం నైతికత కావాలి. దురదృష్టం కొద్దీ నేడు మన నాయకులవన్నీ అవలక్షణాలే ఉంటున్నాయి. వారి ప్రవర్తనారీతులు చూస్తే సిగ్గనిపిస్తోంది. ఆమోదయోగ్యంగా ఉండటం లేదు. మనదేశం ఎదుర్కొంటున్న సమస్యలు వారికి పట్టడంలేదు. సంకుచిత మనస్కులు, వేర్పాటువాదులు, మతవాదులు రాజ్యమేలుతున్నారు. దేశ జనాభా ఎదుర్కొంటున్న అనేక సమస్యల్లో ఇప్పుడు రాజకీయ రుగ్మత కూడా చేరింది.

## మంచి నాయకుల కోసం...

రాజకీయాల్లో గూండాలు, రౌడీలు చేరి పవిత్ర రాజకీయాలను కలుషితం చేస్తున్నారు. రాజకీయ పార్టీలు సైతం ఇలాంటి వారికే కొమ్ముకాస్తున్నాయి. రౌడీ ముదిరితే రాజకీయ నాయకుడు అన్న చందంగా మారింది నేటి పరిస్థితి. బాధ్యత కలిగిన మేధావులు, విద్యావంతులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రజలకు ముగ్గురు దొంగలను చూపి ఒక దొంగకు ఓటెయ్యమంటున్నారే కానీ ప్రజల మేలుకోరే ఏ ధార్మిక సంస్థా ప్రత్యామ్నాయ పవిత్ర రాజకీయ పార్టీని స్థాపించడం లేదు. సమాజంలో మంచి పేరున్న, ప్రజల మేలుకోరి చిత్తశుద్ధితో పనిచేసే నాయకులు, మేధావులు రాజకీయాల్లోకి రాకపోతే ముందు ముందు పరిస్థితి మరింత దిగజారే ప్రమాదముందని నేటి పరిస్థితులే తెలుపుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ చీకటి తెరల మాటున వెలుగు దాగి ఉంది. మంచి నాయకత్వాన్ని ప్రజలకు అందించే విషయంలో విలువలు, సంప్రదాయాలు ఇంకా తుడుచుకుపోలేదు. మంచి నాయకత్వ లక్షణాలు కలిగి, ప్రజాసేవ పట్ల చిత్తశుద్ధి గలవారు రాజకీయాల్లోకి రావాల్సిన సమయం ఆసన్నమైంది. మహాత్మాగాంధీ, ముహమ్మద్‌అలీ జౌహర్ వంటి నాయకుల వలె మానవ హక్కులు, స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు ధారపోయగల నాయకులు మనలో ఇంకా మిగిలి ఉన్నారు. చిత్తశుద్ధిగలవారు, బుద్ధిమంతులు రాజకీయాల్లోకి రావాలని దేశ ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు. అలాంటి వారు మనజాతి పునర్నిర్మాణానికి, దేశ ప్రగతికి కృషిచేస్తారన్న ఆశతో, వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు.

★★★




**ప్రజా** సంక్షేమమే ధ్యేయంగా వినూత్న రాజకీయ సంస్కృతి, కొత్త మున్సిపాలిటీ, కొత్త పంచాయతీ, కొత్త ఆశలు, సరికొత్త వెలుగులు అనే నినాదంతో **'సిటిజన్ ఫర్ వెల్ఫేర్ అండ్ జస్టిస్'** పని చేస్తుందని ఆ వేదిక కన్వీనర్ అబ్దుల్ జబ్బార్ సిద్దీఖీ అన్నారు. జులై 11న హైదరాబాద్‌లో రాజకీయ వేదిక ఆవిర్భావ మహోత్సవంలో వేదిక ఆశయాలను, లక్ష్యాలను ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర రాజకీయ చరిత్రలో సి.డబ్ల్యు.జె. నూతన అధ్యాయ మన్నారు. అందరికీ న్యాయం, అన్ని వర్గాల ప్రజలకు సమంగా అభివృద్ధి ఫలాలు, రాజకీయ, సామాజిక వ్యవస్థలో చెడును నిర్మూలించి మంచిని ప్రోత్సహించే తదితర లక్ష్యాలతో వేదిక కృషి చేస్తుందని ఆయన వివరించారు. 63 ఏళ్ల ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు ప్రజల తలరాతను మార్చలేకపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దారిద్ర్యం, ఆకలి చావులు, నిరక్షరాస్యత, వ్యాధులు తదితర సమస్యలను ప్రజలెదుర్కొంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గూండాలు, అవినీతి పరులు రాజ్యమేలుతున్నారని విమర్శించారు. అసలు సిసలైన ప్రజాస్వామ్యం అందించేందుకు తమ వేదిక కట్టుబడి పనిచేస్తుందని ఆయన తెలిపారు. గ్రామ, పట్టణస్థాయిలో సంస్కరణలు చేపట్టేందుకు త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి సంసిద్ధమవుతోందని ప్రకటించారు. తమ పార్టీ కుల మతాలకతీతంగా మెరుగైన సమాజం కోసం సంఘర్షిస్తోందని ఆయన వివరించారు.

### బీదరికంతో ఆకలి చావులు

దేశానికి స్వాతంత్ర్యం లభించి 63 ఏళ్లు దాటినా ప్రజల స్థితిగతులు మారలేదని సి.డబ్ల్యు.జె. అధికార ప్రతినిధి సాదిఖ్ అహ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో పేదల ఆరోగ్యం ప్రశ్నార్థకంగా మారిందని ఆయన విచారాన్ని వెలిబుచ్చారు. ప్రజలందరికీ స్వచ్ఛమైన మంచి నీరు కూడా అందించడంలో మన ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. సి.డబ్ల్యు.జె. ప్రజల్లో, వ్యవస్థల్లో, రాజకీయాల్లో నైతిక మార్పును తీసుకువస్తుందని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల నుంచి పార్లమెంటు ఎన్నికల వరకు సి.డబ్ల్యు.జె. పోటీ చేస్తుందని ప్రకటించారు. పవిత్రమైన రాజకీయ వ్యవస్థను ప్రజలకందించేందుకు తమ వేదిక అవిరళ కృషిచేస్తుందని పేర్కొన్నారు.

### ప్రస్తుత రాజకీయాలు కలుషితమై పోయాయి : ఎమ్మెల్సీ నాగేశ్వర్

ప్రస్తుత రాజకీయాలు కలుషితం అయ్యాయని, అభివృద్ధితో పాటే అవినీతి పెరుగుతోందని ఎమ్మెల్సీ నాగేశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. సి.డబ్ల్యు.జె. ఆవిర్భావ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజకీయాల్లోని అవినీతిని కూకటివేళ్లతో పెకలించినప్పుడే సామాజిక న్యాయం సాధ్యపడుతుందని ఆయన అన్నారు. ప్రస్తుత రాజకీయాలు డబ్బు, మద్యంతో నడుస్తున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నీళ్లు దొరకని గ్రామం ఉండవచ్చుగానీ, మందు దొరకని ప్రాంతమే లేదన్నారు. రాష్ట్ర బడ్జెట్ లక్ష కోట్లు ఉంటే అందులో 60 నుంచి 70 వేల కోట్లు కేవలం తాగుబోతుల బడ్జెట్ ఉందని విమర్శించారు. చదువుకున్న మేధావులు సైతం అవినీతికి దాసోహమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు కూడా చైతన్యవంతులయ్యారని, ఎమ్మెల్సీగా రూ.2 లక్షలు కూడా ఖర్చు చేయకుండా తాను గెలవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇప్పుడున్న పాలకులు ఏవో డిమాండ్ల గురించి మాట్లాడుతున్నారే గానీ, మంచి పాఠశాల కావాలి, ఉపాధ్యాయులు కావాలి, ప్రతి పిల్లాడు చదువుకోవాలని కచ్చితంగా చెప్పకపోవడం దురదృష్టకరమన్నారు. పి.ఒ.డబ్ల్యు. అధ్యక్షురాలు సంధ్య మాట్లాడుతూ... మహిళలు చైతన్యవంతులై అవినీతి భరతం పట్టాలన్నారు. ఎంపీజే అధ్యక్షులు హామీద్ ముహమ్మద్ ఖాన్ మాట్లాడుతూ రంగనాథ్‌మిశ్రా కమిటీ నివేదిక ప్రకారం ముస్లింలు అత్యంత వెనుకబాటుతనాన్ని అనుభవిస్తున్నారన్నారు. వారి అభ్యున్నతికి ఏ ప్రభుత్వమూ చిత్తశుద్ధితో కార్యక్రమాలు అమలు చేయడంలేదన్నారు. ఈ సదస్సులో జామె నిజామియా ముఫ్తీ సాదిక్ మొహియుద్దీన్, జమీఅతె అహ్లె హదీస్ అధ్యక్షులు షఫీ అహ్మద్ మదనీ, హెల్ప్ హైదరాబాద్ అధ్యక్షులు జి.ఎం.ఖాద్రి, ముస్తాక్ మలీక్, మౌలానా హుస్సేన్, ఇక్బాల్ అహ్మద్ ఇంజనీర్‌లతో పాటు సి.డబ్ల్యు.జె. మహిళా ప్రతినిధి ఖాలిదాపర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

*- రిపోర్టు: యం.డి. ముజాహిద్*

జీవనధార

# ఇహపరాల సాఫల్యం

ముహమ్మద్ గౌస్‌ఖాన్

ప్రతి వ్యక్తి గౌరవ మర్యాదలు అతని నడవడికపై ఆధారపడి ఉంటాయి. తనను తాను గౌరవించుకునే (Self Respest) విచక్షణా జ్ఞానం ఎవరికయితే ఉంటుందో అల్లాహ్ అలాంటి వారినే గౌరవిస్తాడు. మీరు ఇతరులను గౌరవించినట్లయితే, వారూ మిమ్మల్ని గౌరవిస్తారు ఒకవేళ మీరు ఇతరులను అవమానపరిచి సంతోషిస్తున్నట్లయితే, ఇతరుల దృష్టిలో మీరూ అల్పులైపోతారు. గుర్తుంచుకోండి! ఎవరయినా తన మాట, చేతల వల్లే గౌరవాన్ని పొందగలడు. నేను మీకు కొన్ని అమూల్యమైన విషయాలను తెలియజేస్తాను. మీరు వీటిపై ఆచరించినట్లయితే సమాజంలో ప్రతిచోటా మీకు గౌరవ మర్యాదల స్థానం సిద్ధిస్తుంది. ఇంకా ఏఏ విషయాలు, మాటల వల్ల మీ గౌరవ మర్యాదలు శాశ్వతంగా మంటగలిసిపోతాయో వాటిని కూడా మీ ముందుంచుతాను. మీరు వాటిని గుర్తించి, ఆచరించి నట్లయితే ఇన్షాఅల్లాహ్ (అల్లాహ్ తలిస్తే) ఇహపరాల సాఫల్యం మీ పాదాల చెంతకు చేరుతుంది. ఆ అమూల్య విషయాలు.

- ఎల్లప్పుడూ దైవభీతి కలిగి ఉండండి. ఎందుకంటే- విశ్వాసుల ముందు అల్లాహ్ ప్రస్తావన వస్తే వారి హృదయాలు కంపించి పోతాయి. వారి ముందు అల్లాహ్ గ్రంథాన్ని పఠిస్తే, వారి విశ్వాసం రెట్టింపు అవుతుంది. వారు అల్లాహ్‌ను నమ్ముకుంటారు. ఇలాంటి విశ్వాసులే సాఫల్యం పొందుతారు.
- వంశ గౌరవం గురించి కూడా గొప్పలు చెప్పుకోకూడదు. ఎందుకంటే మీరందరు ఒకే తండ్రి హజ్రత్ ఆదం(అలై)గారి సంతానమే. ఈ తెగలు, వంశాలు కేవలం గుర్తింపు కోసమే. ధర్మనిష్ఠ గలవారే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవప్రదములు.
- సహనం, నమాజ్ ద్వారా అల్లాహ్ సహాయాన్ని కోరండి. ఇది ఎంతో కష్టంతో కూడుకున్న పని. అయితే, వినయ విధేయతలు గల వారికి ఎంతో సులభమైన పని. ఇంకా, 'ఏదో ఒకరోజు అల్లాహ్ దగ్గరికి చేరుకుంటాము. ఆయన్ను కలుసుకుంటాము' అనే ధ్యాస వారికి ఉంటుంది.
- ఆపద సమయంలో సహనం వహిస్తే, పుణ్యం లభిస్తుంది. తద్వారా స్వర్గం ప్రాప్తిస్తుంది.
- మంచి విషయమైతే మాట్లాడండి. లేదా ఊరుకోండి.
- తెలియని విషయం గురించి మాట్లాడకండి.
- తెలిసి కూడా యదార్థాన్ని, న్యాయాన్ని అన్యాయంపాలు చేయకండి. వాస్తవాన్ని దాచకండి.
- ప్రజలతో మంచి విషయాలు చర్చించండి.
- ఎదుటివారికి ఉత్తమ రీతిలో సమాధానమివ్వండి. తద్వారా మీరు శత్రువును కూడా జయిస్తారు. శత్రువు ప్రాణమిత్రుడవుతాడు. ఇలాంటి అవకాశం సహనం వహించే అదృష్టవంతులకే ప్రాప్తమవుతుంది.
- పరస్పరం మీరూ మీ స్నేహితులు పిలుచుకున్నట్లు పెద్దలను పిలవకండి. వారిని గౌరవంగా మర్యాదపూర్వకంగా సంబోధించండి.
- సత్యాన్ని అవలంబించండి. సత్యం ఎప్పుడూ సన్మార్గాన్నే చూపుతుంది. సన్మార్గం మనిషిని స్వర్గంలో ప్రవేశింపజేస్తుంది.
- విశ్వాసులైన సోదరులతో నవ్వుతూ మాట్లాడం కూడా సదఖా (దానం) అవుతుంది.
- నోటిని అదుపులో ఉంచుకోవడం అంటే వ్యర్థ ప్రేలాపన, అర్థంపర్థం లేని మాటలు మాట్లాడకపోవడం వల్ల అన్నిరకాల పాపకార్యాలు దూరమవుతాయి.
- ముస్లిం సోదరులకు సలామ్ తెలపాలి.
- ఇంట్లోకి వెళ్ళేటప్పుడు ఇంటి వారికి సలామ్ తెలిపి మరీ వెళ్ళాలి. ఇది అల్లాహ్ తరపున శాంతిశ్రేయాల దుఆ.
- ఇతరుల ఇంట్లోకి వెళ్ళదలుచుకుంటే, ఆ ఇంటి బయట నిలబడి పిలవండి. ఇంట్లోనివారు బయటికొచ్చి మిమ్మల్ని లోనికి ఆహ్వానించేవరకు వారి అనుమతి లేకుండా వారికి సలామ్ తెలుపకుండా లోనికి వెళ్ళకండి. ఇది మీకు ఉత్తమమైన పద్ధతి. వెనుదిరిగి వెళ్ళిపొండని సమాధానం వస్తే, వెనక్కి వెళ్ళిపోండి. ఇదే మీకు ఉత్తమం.
- మీరు ఏదయినా సమావేశంలో పాల్గొని ఉంటే నాయకుని

ఇతరుల ఇంట్లోకి వెళ్ళదలుచుకుంటే, ఆ ఇంటి బయట నిలబడి పిలవండి. ఇంట్లోనివారు బయటికొచ్చి మిమ్మల్ని లోనికి ఆహ్వానించేవరకు వారి అనుమతి లేకుండా వారికి సలామ్ తెలుపకుండా లోనికి వెళ్ళకండి. ఇది మీకు ఉత్తమమైన పద్ధతి.

ఎదుటివారికి ఉత్తమ రీతిలో సమాధానమివ్వండి. తద్వారా మీరు శత్రువును కూడా జయిస్తారు. శత్రువు ప్రాణమిత్రుడవుతాడు. ఇలాంటి అవకాశం సహనం వహించే అదృష్టవంతులకే ప్రాప్తమవుతుంది.

అనుమతి లేకుండా ఎప్పుడంటే అప్పుడు అక్కడినుండి లేచి వెళ్ళిపోకండి.

- ▼ మంచి జరిగితే అది దేవుని దయగా భావించండి. చెడు అయితే అది మీ కర్మల ఫలితమని భావించండి.
- ▼ ఏదయినా ఒక రంగంలో అల్లాహ్ మీకంటే ఇతరులకు పెద్ద స్థాయిలో ఉంచితే, దానిపట్ల మీరు అత్యాశపడకండి. దీనివల్ల అసూయ. మీరు ఎప్పుడూ అల్లాహ్ కృపనే కోరుకోండి. ఎవరు చేసుకున్నది వారు అనుభవించవలసి ఉంటుంది.
- ▼ శత్రువును జయించాలన్నా, అతన్ని మిత్రునిగా చేసుకోవాలన్నా చెడుకు మంచితో సమాధానమివ్వండి.
- ▼ క్షమించడం, సంధి కుదర్చడం ఎంతో పుణ్యకార్యం.
- ▼ నమాజ్‌ను స్థాపించండి. ప్రజల మధ్య సంధి కుదర్చడం, వారి పట్ల సత్ప్రవర్తన కలిగి ఉండటం కంటే మంచి పని మరేదీ లేదు.
- ▼ వాగ్దానం చేసేటప్పుడు ఇన్షాఅల్లాహ్ అని తప్పకుండా చెప్పండి. మరిచిపోతే గుర్తు వచ్చినప్పుడు చెప్పండి.
- ▼ సిగ్గుకు, విశ్వాసానికి దగ్గరి సంబంధం ఉంది. వీటిలో ఏ ఒక్కటి కోల్పోయినా రెండవదీ కోల్పోయినట్లే.
- ▼ గుర్తుంచుకోండి! 'ఇన్షాఅల్లాహ్' అని చెప్పనివారు దైవాగ్రహానికి గురికావలసి ఉంటుంది.
- ▼ గర్విష్టిని అల్లాహ్ ఇష్టపడడు. అతని స్థానం నరకం.
- ▼ భూమిపై విర్రవీగుతూ నడవకండి. దీనివల్ల మీరు భూమిని చీల్చలేరు.
- ▼ ఇతరుల లోపాలను వెతకకండి. చెడు పేర్లతో పిలవకండి.
- ▼ పుణ్యకార్యాలు ప్రదర్శనకోసం చేస్తే, బండపై నున్న మట్టిని వర్షం ఎలా తుడిచిపెట్టుకొని పోతుందో, పుణ్యకార్యాలనూ అలాగే నష్టపరుస్తుంది.
- ▼ ఒకరికి సహాయం చేసి, మాటిమాటికి ఎత్తి చూపకండి. దీనివల్ల పుణ్యమంతా మంటగలిసి పోతుంది.
- ▼ కోపాన్ని దిగమింగండి. పరుల తప్పులను మన్నించి వేయండి.
- ▼ హృదయ కాఠిన్యం, కఠిన మనస్తత్వాలకు దూరంగా ఉండండి. లేకపోతే జనులకు మీ పట్ల విరక్తి కలుగుతుంది.
- ▼ ఈర్ష్య, అసూయలకు దూరంగా ఉండండి. అగ్ని కట్టెలను కాల్చి ఎలా బూడిదగా చేసి వేస్తుందో, అలాగే అసూయ కూడా శుభాలను బూడిదపాలు చేస్తుంది.
- ▼ అల్లాహ్ దౌర్జన్యపరులను ఇష్టపడడు.
- ▼ పీడితుల శాపానికి గురికాకండి. పీడితుల దుఆ వెంటనే స్వీకార యోగ్యమవుతుంది.
- ▼ ఇతరుల పట్ల అనుమానపడకండి. వారి రహస్యాలను వెతకకండి.
- ▼ ఇతరుల లోపాలను వెతకడం, నిందలు మోపడం వినాశనానికి కారణం.
- ▼ పరోక్ష నిందకు పాల్పడకండి. ఇతరులపై చాడీలు చెప్పకండి.
- ▼ చాడీలు చెప్పేవారు లోకంలో అందరికంటే దురదృష్టవంతులు.
- ▼ చాడీలు, పరోక్ష నిందలు మనిషి విశ్వాసాన్ని 'కాపరి చెట్ల ఆకులను ర్చాలి వేసేటట్లు'నాశనం చేస్తాయి.
- ▼ ఇద్దరు వ్యక్తులు మూడో వ్యక్తిని పట్టించుకోకుండా సంభాషించుకోకూడదు. అలా చేయడం వల్ల మూడో వ్యక్తికి బాధ కలుగుతుంది.
- ▼ కపటి, దురాచారుల ప్రశంస చెయ్యరాదు. దీనివల్ల అల్లాహ్‌కు ఆగ్రహం కలుగుతుంది.
- ▼ హాస్యంతో ఇతరులను నవ్వించే వ్యక్తి అంటే అల్లాహ్‌కు చాలా అయిష్టం. అతనికి నరకమే ప్రాప్తిస్తుంది.
- ▼ కపటుల నాలుగు గుణాలు

  అ) మాట్లాడితే అబద్ధం పలుకుతారు.

  ఆ) వాగ్దానం చేస్తే దానిని నెరవేర్చరు.

  ఇ) జగడానికి దిగితే దుర్భాషలాడతారు.

  ఈ) అమానతు (అప్పగింత) ఉంచితే దానిని అపహరించుకుంటారు.

నా యువ స్నేహితులారా! ఈ విషయాలన్నీ అల్లాహ్, ఆయన ప్రవక్త(స) మన శ్రేయకోసం తెలియజేశారు. వీటిలోనే మన ఇహపరాల సాఫల్యం ఉంది. కాబట్టి మీరు కూడా వీటిని ఆచరించి సాఫల్యం పొందండి.


గీటురాయి
వారపత్రిక

**రచయితలకు విజ్ఞప్తి**

గీటురాయి సమాజంలో నైతిక మార్పును కోరుకునే వారపత్రిక. రచయితలు సామాజిక, ధార్మిక, ఆరోగ్యకరమైన రాజకీయ అంశాలను రచించి తమ భావాలను లిఖిత పూర్వకంగా వ్యక్తపరచగలిగే అవకాశాన్ని గీటురాయి కల్పిస్తుంది. రచయితలు తమ అమూల్యమైన వ్యాసాలను వ్రాసి పంపాలని కోరుతున్నాం. - ఎడిటర్




## మూడు, మూడు 72 గంటలా?

మత్తయి సువార్త 12:40ను చర్చకు పెడితే పవిత్రాత్మచే ప్రేరేపితులైన పరిశోధకులు, వేదాంత మహోపాధ్యాయులు, ఆచార్యులు తప్పనిసరిగా ఈ చర్చలో సమయం విషయాన్ని ఒత్తి పలుకుతూ జవాబిస్తారు. "యోనా మూడు రాత్రింబవళ్లు తిమింగలం కడుపులో ఎలాగుండెనో, అలాగు మనుష్య కుమారుడు మూడు రాత్రింబగళ్ళు భూగర్భంలో వుండును." (ఆంగ్ల బైబిల్‌లో Three nights and Three days అంటూ నాలుగు సార్లు పునరావృతం అయింది. తెలుగు బైబిల్ అనువాదకులు కేవలం రెండుసార్లు రాసి సరిపెట్టుకున్నారు- అనువాదకుడు) గమనించవలసిన విషయం ఏమంటే; ఏసు తన భవిష్యవాణిని నెరవేర్చారని రుజువు చేయడానికి బైబిల్ వేదాంత పండితులు మూడు (Three) అన్న పదాన్ని తెలుగులో రెండుసార్లు, ఇంగ్లీషులో నాలుగు సార్లు ఒత్తి పలుకుతారు. తద్వారా ఎంత సమయం యోనా ప్రవక్త తిమింగలం కడుపులో వున్నారో, అంతే సమయం ఏసువారు కూడా భూగర్భంలో వున్నారని దృఢపర్చడానికి కృషి చేస్తూ తప్పులో కాలేసి కూర్చున్నారు. అయితే చాలా తెలివిగా మరికొంత కుట్ర పూరితంగా యోనా ఎలాగుండెనో అన్న విషయానికి జీవించి వుండెనా? లేక మరణించెనా? అని జవాబు చెప్పకుండా విషయాన్ని దాటవేస్తారు.

ఇంత ఖచ్చితంగా, గట్టిగా సమయం గురించి భవిష్యవాణి చెప్పిన ఏసు దానిని యూదుల ముందు నెరవేర్చారా?' అని ప్రశ్నిస్తే క్రైస్తవ పిడివాద పండితులు 'ఖచ్చితంగా నెరవేర్చారు' అని బదులిస్తారు.

## ప్రభుత్వ సెలవు

తదుపరి ప్రశ్న ఏమిటంటే, ఏసువారు ఎప్పుడు శిలువ వేయబడ్డారు? అన్నది. సమస్త క్రైస్తవ ప్రపంచం ముక్తకంఠంతో 'శుక్రవారం'అని బదులిస్తుంది. ఈ కారణంగానే 'గుడ్ ఫ్రైడే'ను ప్రభుత్వ సెలవు దినంగా అనేక దేశాలు ప్రకటించాయి కాబోలు. అమెరికా నుండి జాంబియా వరకు; అబిసీనియా నుండి జైరే వరకు వున్న క్రైస్తవ ప్రజా సమూహాలు 'గుడ్ ఫ్రైడే' రోజును 'ఈస్టర్'గా ప్రభుత్వ సెలవు దినంగా పాటిస్తున్నారు. 'గుడ్ ఫ్రై డే' (శుభ శుక్రవారం-)ను 'గుడ్' (శుభం)గా చేసినది ఏమిటి? 'ఈ దినాన క్రీస్తు మన పాపముల పరిహారం నిమిత్తం శిలువపై వ్రేలాడదీయబడి మరణించాడు'అని క్రైస్తవులు చెప్తారు. అంటే ఏసువారు 2010 ఏళ్ళ క్రితం ఒకానొక శుక్రవారం రోజున శిలువపై చంపబడ్డారు. 'అవునా?' అని ప్రశ్నిస్తే అవును అని క్రైస్తవ సోదర సమాజం బదులిస్తుంది.

సువార్తలలో ఏసు వారి శిలువకు సంబంధించిన విషయాలన్నింటిని సమీకరించి పరిశీలిస్తే తెలిసే విషయం ఏమిటంటే, యూదు నాయకులు వీలైనంత త్వరగా ఏసువారిని చంపివేయాలని ప్రయత్నిస్తున్నారు. అర్ధరాత్రి ఏసుపై విచారణ జరిగింది. ఉదయానికి ఆయనను 'పొంతి పిలాతు' వద్దకు పంపారు. అక్కడి నుండి 'హీరోదు' వద్దకు- మరలా అక్కడి నుండి పిలాతు వద్దకు ఈవిధంగా ఏసును తిప్పారు. యూదు నాయకుల మనసులో ఉన్న భయం అంతా సాధారణ ప్రజలకు సంబంధించినదే. సాధారణ ప్రజలు ఏసును రక్షకుడుగా భావిస్తున్నారు. ఈ కారణంగానే ఏసు శత్రువులైన యూదు నాయకులు వీలైనంత త్వరగా ఈ 'బెడద'ను తప్పించివేయాలని తొందరపడ్డారు. అందులో విజయం సాధించారు. అయితే, పరిస్థితులు ఎలా మారాయంటే, యూదులు ఏసును శిలువపై వ్రేలాడదీయడానికి తొందర, ఆత్రుత చూపారో- ఆయనను శిలువపై నుండి దించడానికి కూడా అంతే తొందర, ఆత్రుత చూపారు. దానికి కారణం 'సబ్బాత్ దినం' ఏసును శిలువపై ఎక్కించిన దినం శుక్రవారం.

శుక్రవారపు సూర్యాస్తమయం నుండి 'సబ్బాత్' ప్రారంభమవుతుంది. ద్వితీయోపదేశం 21:23 ప్రకారం 'వ్రేలాడదీయుడు వాడు దేవునికి శాపగ్రస్తుడు'కనుక అతడు రాత్రియందు మ్రాను (శిలువ)పై వేలాడకూడదు. శుక్రవారం తరువాత వచ్చేది శనివారం అనగా 'సబ్బాత్ దినం' ఆ రోజు యూదులు ఏ పనీ చేయ కూడదు. కడకు ఆహారం కూడా భుజించరాదు. ఈ కారణంగానే 'నీ దేవుడైన యెహోవా స్వాస్థ్యముగా నీకిచ్చుచున్న దేశమును నీవు అపవిత్ర పరచకుండునట్లు అగత్యముగా ఆ దినమున వానిని పాతిపెట్టవలెను.' (ద్వితీ : 21: 23)

యూదు శాస్త్రుల, పరిశయ్యులు. ఈ మత మనోవేదనను సందర్భాన్ని తమకు అను కూలంగా ఏసు రహస్య శిష్యులు ఉపయోగిం చుకున్నారు. ఆయన శరీరాన్ని త్వరగా శిలువ నుండి దించివేశారు. యూదుల తరహాలో ఖనన స్నానం చేయించి 'బోళములతో కలిపిన అగరు రమారమి నూట ఏబది శేర్లు తెచ్చి.... సుగంధ ద్రవ్యములను పూసి, నారబట్టలు చుట్టిరి (యోహాన్ : 20: 39,40) తరువాత గుడ్డతో కప్పబడిన ఏసు శరీరాన్ని 'రాత్రి, ఆవరించకమునుపే' సమాధిలో పెట్టారు.

## ఎందుకు 'భావించాలి'

క్రైస్తవులలో లెక్కకుమించిన మత శాఖలు, సంఘాలు ఉన్నాయి. వాటి మధ్య మౌలికమైన విభేదాలు కూడా అనేకం ఉన్నాయి. అయినా ఏసు శిలువ విషయంలో అన్ని శాఖలు, సంఘాలు- భావాలు, ఊహాలు, తలచడాలు అన్నీ ఒకేలా ఉన్నాయి. ఏసు శుక్రవారం రాత్రి సమాధిలోనే ఉన్నారని తలుస్తాను. ఆయన శనివారం ఉదయం కూడా సమాధిలోనే ఉన్నారని తలుస్తాను. ఆయన శనివారపు రాత్రి కూడా సమాధిలోనే ఉన్నారని తలుస్తాను. ఈ 'తలంచడాన్ని' క్రైస్తవులందరూ సంతోషంగా, సంపూర్ణ హృదయంతో అంగీకరిస్తారు. మరి 'తలంచడం', 'ఊహించడం' ఎందుకు? బైబిల్‌లోని సువార్తలు, ఏసు ఎప్పుడు 'ఖచ్చి తంగా' సమాధి నుండి బయటికి వచ్చారు? అనే విషయం పట్ల మౌనం వహిస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం ఇంకా చీకటి వాలకమునుపే ఏసు తన 'రహస్య శిష్యుల'తో అనుకూలమైన, విశాలమైన, విశ్రాంతికరమైన సమాధి స్థలానికి చేర్చబడ్డారు. ఆ తరువాత ఏం జరిగింది? ఈ విషయంలో సువార్తీకు లందరూ మౌనం వహించడం వల్ల నేను దానిపై వాఖ్యానించలేను. (రచయిత అహ్మద్ దీదాత్) కనుకనే నేను 'తలంచు', 'ఊహించు', 'భావించు', లాంటి పదాలను నొక్కి చెప్ప వలసి వచ్చింది.

ఇక అంతిమ పరిశీలన ద్వారా ఏసు వారు 'మూడు' పగళ్ళు, 'మూడు' రాత్రుళ్ళు సమాధిలో ఉన్నారా? అనేది ఈ క్రింద ఇచ్చిన టేబుల్ ద్వారా గమనిద్దాం.

ఎటువంటి సందేహానికి తావు లేకుండా కూడికల మొత్తం 'ఒక పగలు' 'రెండు రాత్రు లు'గా తేలుతుంది తప్ప క్రైస్తవ వేదాంతులు వల్లెవేస్తున్నట్లుగా 'మూడు పగళ్ళు', 'మూడు రాత్రులు'గా లేదు. ఈవిధంగా క్రైస్తవ పవిత్ర గ్రంథాల ప్రకారం ఏసు రెండవసారి కూడా భవిష్యవాణిని నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారు. 'మొదటిది' ఏసు, యోనా ప్రవక్తలా లేరు. యోనా తిమింగలం కడుపులో 'సజీవుడై' వుండగా మనుష్య కుమారుడైన ఏసు 'నిర్జీవుడై' వున్నాడు. ఈ రెండు విష యాలు పరస్పర వ్యతిరేకమైనప్పటికీ- విచి త్రంగా క్రైస్తవ సోదరులు ఈ విషయాలనే నిజ మని ఆమోదిస్తున్నారు, విశ్వసిస్తూ వున్నారు.

ఇక 'రెండవది' ఏసు తనకు తానుగా చెప్పిన సమయానికి సంబంధించి భవిష్యవాణిని కూడా నెరవేర్చడంలో విఫలమయ్యారు. క్రైస్తవ సామ్రాజ్యంలోని అత్యంత ప్రతిభావంతుడైన గణితశాస్త్ర నిపుణుడు కూడా 'మూడు' పగళ్ళు, 'మూడు' రాత్రుల సమస్యను పరిష్కరించలేడు. ఆదివారం- వారం యొక్క 'మొదటి' రోజు. మగ్దలేనె మరియ సూర్యో దయానికి ముందే ఏసును వుంచబడిన సమాధి వద్దకు వెళుతుంది. అది ఖాళీగా వుంటుంది. ఈ విషయం స్పష్టమైన భాషలో పదాల్లో మనకు సువార్తలు చెప్పే వున్నవి.

## 'గుడ్' వెడ్‌నెస్ డే
## (మంచి బుధవారం)

క్రైస్తవ ప్రపంచపు అంక గణిత పాండిత్యంలోని డొల్లతనాన్ని ఆర్మ్‌స్ట్రాంగ్ కుటుంబం దాచిపెట్ట లేకపోయింది. 'ప్లెయిన్ ట్రూత్' (Plain Truth) పత్రికకు చెందిన బైబిల్ పండితుడు 'మిస్టర్ రాబర్ట్ ఫాహే' (Mr. Robert Fahey) డర్బన్ (దక్షిణాఫ్రికాలోని ఒక పట్టణం)లోని 'హాలిడే ఇన్'లో ఒక ఉపన్యాసమిచ్చాడు. ఆ సభలో నేను కూడా పాల్గొన్నాను. (మూల రచ యిత అహ్మద్ దీదాత్ రహ్మ) ఆ సభలో తన క్రైస్తవ శ్రోతల ముందు 'మూడు' పగళ్ళు, 'మూడు' రాత్రుల సమస్యను పరిష్కరించే ప్రయత్నంలో 'నిజానికి ఏసును శిలువపై ఎక్కించినది శుక్రవారం నాడు కాదు. అది 'బుధవారం' అని చెప్పి - క్రైస్తవ విశ్వాసులు గత రెండువేల సంవత్సరాలుగా విశ్వసిస్తూ వస్తున్న విషయాన్ని ఒక్కమాటలో నిర్ద్వందంగా తోసిపుచ్చాడు. ఆయన లెక్కల ప్రకారం ఆది వారం ఉదయాన్ని వదిలేసి, వెనుకకు 'మూడు' రాత్రులు, 'మూడు' పగళ్ళు లెక్క

| ఈస్టర్ వారము | | సమాధిలో వుండినది | |
|---|---|---|---|
| | | పగళ్ళు | రాత్రులు |
| 1) | శుక్రవారం సూర్యాస్తమయానికి ముందు సమాధిలో ఉంచబడ్డారు | లేదు | ఒక రాత్రి |
| 2) | శనివారం సమాధిలో ఉన్నట్టు తలంచ వచ్చు | ఒక పగలు | ఒక రాత్రి |
| 3) | ఆదివారం సూర్యోదయానికి ముందే అదృశ్యం | లేదు | లేదు |
| | మొత్తం | ఒక పగలు | రెండు రాత్రులు |

కట్టబడాలి. ఈ విధంగా లెక్క తేలిన దినమే నిజమైన 'శిలువ దినం' ఈ లెక్కన మనకు బుధవారం జవాబుగా వస్తుంది. అంటే 'గుడ్ ఫ్రై డే' బదులు 'గుడ్ వెడ్‌నెస్ డే' అన్నమాట.

మిస్టర్ ఫాహే వివేకం, సూక్ష్మబుద్ధికి ఆయనకు అభినందనలు తెలిపాను. దానితోపాటే ఒక సందేహం కూడా వెలిబుచ్చాను. 'మీరు చెబుతున్న ప్రకారం శిలువ దినం బుధవారమైతే గత రెండు వేల సంవత్సరాల నుండి క్రైస్తవ ప్రపంచం 'శుభ బుధవారం' బదులు 'శుభ శుక్రవారం' జరుపుకుంటున్నారు. మరి కోట్లాది మంది క్రైస్తవులు ప్రపంచవ్యాప్తంగా ఇంత అజ్ఞానంగా, నిర్లక్ష్యంగా తమ రక్షకుని శిలువ దినాన్ని ఎలా మరిచిపోయారు? పేతురు నుండి నేటి పోపు వరకు ఎడతెగని రోమన్ కాథలిక్కుల గొలుసు క్రమం కూడా మీ లెక్క ప్రకారం సమస్త క్రైస్తవ లోకాన్ని దారి తప్పించారని అర్థమవుతుంది కదా!'అన్నాను.

### దేవుడా? లేక దెయ్యమా?

గత 'రెండువేల సంవత్సరాలుగా' మిలియన్ల కొద్ది క్రైస్తవ సోదరులను మోసంలో పడవేసినది ఎవరు? దేవుడా? దెయ్యమా? అన్న నా ప్రశ్నకు మిస్టర్ ఫాహే ఎలాంటి సంకోచం లేకుండా రూఢీగా చెప్పిన సమాధానం 'దెయ్యం!' (Devil) అని.

శిలువ దినం శుక్రవారమా? లేక బుధవారమా? అన్న అతి చిన్న విషయంలోనే క్రైస్తవులను, వారి విద్వాంసులను అతి తేలికగా మోసం చేయగలిగిన 'దెయ్యం' (సాతాను-Devil), దైవభావనకు సంబంధించిన ఉన్నతస్థాయి విషయాలలో మోసానికి, గందరగోళానికి మరింత సులభంగా గురిచేయకలదు కదా? అని మిస్టర్ ఫాహేను ప్రశ్నించినప్పుడు ఆయన ముఖం సిగ్గుతో ఎర్రబారిపోయింది. మౌనంగా భుజాలు ఎగరేసి చకచకా వెళ్ళిపోయాడు.

ఇదే నేటి క్రైస్తవ యుగ పురుషుల విశ్వాసమైతే- సువార్త కూటముల, కూడికల లక్ష్యమైతే- ఇది చరిత్రలో అత్యంత శక్తివంతమైన 'తంత్ర జాలం' తప్ప మరేమీ కాదని సత్య ధ్వజవాహకులు (ముస్లింలు) వారికి చెప్పి తీరాలి.

**(సమాప్తం)**

షేఖ్ కరీముల్లా, వినుకొండ

## బూచోడొస్తున్నాడు గప్..చుప్

గలగలా నవ్వులొద్దులే
బుడిబుడి నడకల పాపాయి
తూనీగలా గెంతులొద్దులే
చకచక సాగే బుజ్జాయి
బూచోడొస్తున్నాడు
గప్..చుప్
నీ లేత బుగ్గలపై
కూసింత గులాబీ విరబూసినా
వాడు క్లస్టర్ బాంబై వర్షిస్తాడు
నీ చిన్ని పెదాలపై
జరంత నవ్వు విరిసినా
వాడు ఇనుప డేగై పొడుస్తాడు
పలుకుల్లో ప్రేమ వచనాలు
చేతల్లో షైతాన్ కార్యాలు
గుడ్డి నమ్మకాలొద్దు బేటా
ఒక చేత్తో ఆహార పొట్లాన్ని చూపి
మరో చేత్తో గ్రెనేడ్ విసురుతాడు
నమ్మలేం తెల్లోడు కదా!
ఎట్టా నమ్ముతాం...
వాడు ఊపిరి పోసుకున్నాక
రెడ్ ఇండియన్‌లను తిని పెరిగినోడు
భూమి రక్తాన్ని గొట్టాలతో పీల్చి బలిసినోడు
మనం నవ్వినా యుద్ధం చేస్తాడు
ఏడ్చినా యుద్ధం చేస్తాడు
హింస వాడి మాతృభాష

✸✸✸

రేయ్ ఆఫ్ఘన్ పిల్లోడా
ఒరేయ్ ఇరాకీ బుల్లోడా
ఇంత సెప్పినా ఆ ఇకఇకలేందిరా!

✸✸✸

హ్హా....హ్హా.... హ్హా